



గుండె కోత : ఉప్పాడ కొత్తపల్లి మండలం మాయాపట్నంలో కోతకు గురవుతున్న మత్స్యకారుల గృహాలు

తుఫాన్..అలజడి!

అన్నదాతకు అకాలకష్టం



అయ్యో పాపం అన్నదాత : ముమ్మిడివరంలో ధాన్యం రాశి చుట్టూ చేరిన నీటిని మళ్లిస్తున్న రైతు

ఫెంగల్ తుఫాన్ అలజడి.. అన్నదాతల్లో బెంగ తెచ్చింది.. ఏ క్షణం ఎటువంటి కష్టం వస్తుందోనని ఆందోళన చెందుతున్నాడు.. ప్రతి ఏడాది ప్రకృతి అన్నదాతను వదలడంలేదు.. ఏదో ఒక విధంగా నష్టాల బాట పట్టిస్తూనే ఉంది.. ఈ ఏడాది ఏం భయం లేదనుకుంటే ఫెంగల్ తుఫాన్ వచ్చేసింది.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇంకా మాసూళ్లు సాగుతూనే ఉన్నాయి. దీంతో రైతుల్లో అలజడి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందేసరికి వాతావరణంలో వచ్చిన మార్పులతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ ఏడాది పంటలు బాగానే పండాయని సంతోషంలో ఉన్న రైతులను ఫెంగల్ తుఫాన్ ఉరుకులు.. పరుగులు పెట్టిస్తోంది... మరోవైపు సముద్రంలోనూ అలల తాకిడి పెరిగింది.. పరీవాహక ప్రాంత ప్రజలను భయపెడుతోంది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తుఫాన్ భయపెడుతోంది..అకాల కష్టం అన్నదాతను ఆందోళనకు గురిచేస్తోంది.. మరోవైపు సముద్ర తీర ప్రాంతాల్లో అలజడి నెలకొంది.. తుఫాన్ తీరం దాటినా భయం మాత్రం వీడడం లేదు. ఏ క్షణం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. చాలా గ్రామాల్లో పంట కోత దశలో ఉంది. కొన్ని చోట్ల పనల మీద, కుప్పలుగా ఏర్పడి ఉంది. పనలపై ఉన్న పంటను కుప్పలుగా వేసి టార్పాలిన్లు కప్పుతున్నారు. మరోవైపు పచ్చి మీద ఉన్న పంటను కుప్పలుగా వేస్తే ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే నూర్పులు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. తుఫాన్ ప్రభావం కారణంగా వీచిన గాలులకు చాలా గ్రామాల్లో చేలు నేలవాలాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశంలో మబ్బులతోపాటు అక్కడక్కడ చిరుజల్లులు పడ్డాయి. దీంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. వాతావరణం మార్పుతో రైతులు వరికోతలు వాయిదా వేసుకున్నారు. గత రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.



అకాల కష్టం : కరపలో బరకాల కింద దాచిన ధాన్యపు రాశులు

తూర్పున ఉరుకులు.. పరుగులు



రౌతులపూడిలో నేలవాలిన వరి చేను

రాజమహేంద్రవరం/గోకవరం/కడియం/సీతానగరం/ఉండ్రాజవరం/పెరవలి/దేవరపల్లి/గోపాలపురం,నవంబరు30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ తీరం దాటినప్పటికీ దాని ప్రభావంతో జిల్లా ఓ మోస్తరు వానతో పాటు చలిగాలులు వీచాయి. పొలాల్లోనే ధాన్యం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నా రు.మరో వైపు జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన చలిగాలులు వీయడంతో ప్రజలు వణికిపోతున్నారు. జిల్లాలో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం 49,583 హెక్టార్లలో వరి మాసూళ్లు చేయగా 3,22,855 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. రోజుకు సరాసరి 1240 హెక్టార్లలో మాసూళ్లు జరుగుతున్నాయి. ఇంకా కళ్లాల్లో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండి పోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం 30 వేల టన్నుల ధాన్యం కళ్లాలు, రోడ్లమీదే ఉంది. రాజమండ్రి రూరల్ మండలంలో 30 టన్నులు, కడియంలో 800 టన్నులు, రాజానగరంలో 1400, అనపర్తిలో 2300, బిక్కవోలులో 2800, కోరుకొండలో 1500, గోకవరంలో 1800, సీతానగరంలో 1400, రంగంపేటలో 1232, చాగల్లులో 1900, దేవరపల్లిలో 1400, గోపాలపురంలో 1400, కొవ్వూరులో 2138 టన్నులు, నిడదవోలులో 1900, పెరవలిలో 2100, తాళ్లపూడిలో 2200 టన్నులు, నల్లజర్లలో 1800 మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లో ఉంది. కళ్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం టి.రాధిక పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో పర్యటించి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులకు సూచించారు.

పచ్చిధాన్యం కొనుగోలు



మండపేటలో ధాన్యం ఎగుమతి

తుఫాన్ కారణంగా తేమశాతం 25 (తాజాగా నిర్ణయించింది) వచ్చేవరకు ఆరబెట్టుకునే అవకాశం రైతులకు లేనందున పంట చేలో ధాన్యం కోసిన వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించినట్టు సమాచారం. దీంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే గిట్టుబాటు ధర మాత్రం ఇవ్వడం లేదు. కాటాకు రూ.1500 వరకు మాత్రమే రైతులకు గిడుతోంది. దీని వల్ల కాటాకు రూ.250 నుంచి రూ. 300 వందల వరకు రైతులు నష్టపోతున్నారు. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాటాకు రూ.1750 చొప్పున జమ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలకే రైతుల ఖాతాల్లోకి సొమ్ములు పడుతున్నాయి.

- » ఈసారి వదలని వాతావరణం
- » ముంచుకొచ్చిన ఫెంగల్
- » అన్నదాతకు మళ్లీ కష్టాలు
- » చిరుజల్లులతో ఆందోళన
- » రైతుల ఉరుకులు..పరుగులు
- » కోనసీమలో అక్కడక్కడా వాన
- » తూర్పును భయపెట్టిన వరుణుడు
- » కాకినాడలో చెలరేగిన అలజడి
- » ఉదయం నుంచి వీడని మబ్బు
- » పచ్చిధాన్యమూ కొనుగోలు
- » మూడు రోజులు కోతలకు బ్రేక్

కోనసీమలో కంగారు

అమలాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో గత 24 గంటల నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తుంది. అన్నదాతలకు వర్షం కారణంగా కష్టాలు ఎదురయ్యాయి. మాసూళ్లు పూర్తికాకపోవడంతో వరి చేలల్లోనే పంట ఉండిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం తడిసి ముద్దవుతుండడం వల్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ఆర్డీవో కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తూనే ఉంది. వరిచేలల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని సంరక్షించుకునే పనిలో అన్నదాతలు బిజీగా ఉన్నారు. కొందరు రైతులు అతికష్టం మీద ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలిస్తున్నారు. కొన్నిచోట్ల మిల్లుల్లో ధాన్యం తీసుకునేందుకు నిరాకరిస్తున్నందున రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం రాత్రికి తుఫాన్ తీరం దాటితే వర్షాలు కురుస్తాయని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. కోతలు పూర్తయిన పంటను మిల్లులకు తరలించేలా అధికారులు, మిల్లర్లు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. అవసరమైన మేరకు రైతులకు త్వరగా టార్పాలిన్లు అందించే ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు తమ సమస్యలను కంట్రోల్ రూము సెల్ 8309432487, 9441692275కు సమాచారం అందిస్తే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. తుఫాన్ నేపథ్యంలో రైతులు మరో మూడు రోజులపాటు వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1,18,559 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. కోతలు పూర్తి అయి 14,417 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యానికి రూ.252 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

కాకినాడలో కలవరం

పిఠాపురం/సామర్లకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారిన నేపథ్యంలో శనివారం తెల్లవారుజాము నుంచి వాతావరణం మారిపోయింది. రోజంతా ఆకాశం మేఘావృతమై వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. మధ్యలో రెండు, మూడుసార్లు స్వల్పంగా వర్షం కురిసింది. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఈదురుగాలుల ప్రభావం అధికంగా ఉంది. పిఠాపురం నియోజకవర్గంలోని ఏలేరు, పీబీసీ ఆయకట్టుతోపాటు మెట్ట ప్రాంతాల్లో కోతలకు సిద్ధంగా వరిపంట పలుచోట్ల నేలకొరిగింది. మాసూళ్లు జరిగిన ప్రాంతాల్లో అక్కడక్కడ ధాన్యం రాశులు కళ్లాల్లో ఉండి పోయాయి. ఈ ధాన్యాన్ని వర్షానికి తడవకుండా టార్పాలిన్లు, బరకాలు కప్పి నీరు నిలవకుండా రైతులు బాటలు తీస్తున్నారు. తుఫాను ప్రభావం జిల్లాపై అంతగా ఉండదని వాతావరణశాఖ చెప్పినా అందుకు భిన్నంగా ఎక్కువగా ఉండడం రైతులను కలవరానికి గురిచేస్తోంది. తీరం దాటిన తర్వాత దీని ప్రభావం లేకుండా ఉంటే నష్టం జరగకుండా గట్టెక్కుతామని రైతులు ఆశిస్తున్నారు. అలాగే కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను భద్రపరుచుకునేందుకు ప్రభుత్వం టార్పాలిన్లు, బరకాలు సరఫరా చేస్తే రైతులను కొంతమేర ఆదుకున్నట్టు అవుతుందని సామర్లకోట ప్రాంతంలోని రైతులు చెబుతున్నారు.



కన్నీటి సంద్రమే : ఉప్పాడ కొత్తపల్లి మండలం మాయాపట్నంలో సముద్రంలో కొట్టుకుపోయిన ఇల్లు

భయం గుప్పిట తీరం

కొత్తపల్లి/అమలాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాను తీరం దాటినా ఉప్పాడ తీరంలో సముద్రం తీవ్ర స్థాయిలో ఎగిసిపడుతోంది. శనివారం ఉదయం నుంచీ తీరం వెంబడి బలమైన ఈదురు గాలులతో పాటు వర్షం కురుస్తోంది. సముద్రం ఉప్పొంగుతూ మూడు నుంచి నాలుగు మీటర్ల ఎత్తులో కెరటాలు ఒడ్డుకు దూసుకొస్తున్నాయి. ఉప్పాడ శివారు మాయాపట్నం, సూరాడపేట, కొత్తపట్నం, సుబ్బంపేట గ్రామాల్లో ఒడ్డునే ఉన్న మత్స్యకారుల ఇళ్లల్లోకి అలలు పోటెత్తు తున్నాయి.ఇప్పటికే నాలుగు మత్స్యకారుల ఇళ్లు సముద్రగర్భంలో కలిసిపోగా, మరికొన్ని కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి.అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరంలో కోత ఎక్కువగా ఉండి సముద్రం ముందుకు చొచ్చుకువచ్చింది. ఫలితంగా సముద్రం చెంతనే ఉన్న సముద్ర రిసార్ట్స్ కోతకు గురయ్యే ప్రమాదకర పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. పక్కనే ఉన్న ఓఎన్జీసీ ప్లాంట్‌ను సముద్ర కెరటాలు తాకుతున్నాయి. మరో 48 గంటల పాటు వాతావరణం అనుకూలించే అవకాశం లేక మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని జిల్లా అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.



నౌకలో పట్టుబడ్డ రేషన్ బియ్యం (ఫైల్‌ఫొటో)

రేషన్ మాఫియాలో వణుకు

కాకినాడ పోర్టులో విదేశాలకు బియ్యం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదంతో గజగజ - 6లో

నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం



హెచ్‌ఐవీ నిర్మూలనకు చైతన్యమే చికిత్స

- 6లో

వాన జడి..

వణికించిన ఈదురు గాలులు

కాకినాడ సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారడంతో శనివారం జిల్లాను వర్షం తడిపేసింది. ప్రతి మండలంలోను ఒకటి నుంచి 2 మిల్లీమీటర్ల వరకు వాన కురిసింది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఉదయం నుంచి రాత్రి వరకు అడపాదడపా వర్షం పడుతూనే ఉంది. కొన్ని మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. జిల్లాలోని కోటనందూరు, తుని, తొండంగి, తాళ్లరేవు మండలాల్లో వర్షం కారణంగా జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. ఇదిలా ఉండగా జిల్లాలో గడచిన 24 గంటల్లో 3.5 మి.మీ. సరాసరితో మొత్తంగా 73.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కోటనందూరు మండలంలో 8.6 మి.మీ. వర్షపాతం నమోదుకాగా, అత్యల్పంగా గండేపల్లి మండలంలో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు.. మి.మీ.లలో.. తుని 8.4, తొండంగి 5.0, రౌతులపూడి 4.6, ఏలేశ్వరం 4.6, తాళ్లరేవు 4.6, శంఖవరం 4.2, ప్రత్తిపాడు 4.0, యు కొత్తపల్లి 3.8, పిఠాపురం 3.6, కాజులూరు 3.6, కిర్లంపూడి 3.2, గొల్లప్రోలు 3.2, కాకినాడ రూరల్ 2.4, కాకినాడ అర్బన్ 2.4 జగ్గంపేట 1.6, సామర్లకోట 1.6, కరప 1.6 మి.మీ.

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ 94 శాతం : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో శనివారం సాయంత్రం ఏడు గంటల వరకు 94 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తిచేయడం జరిగిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఎన్‌టీఆర్ భరోసా పింఛను పథకం కింద పింఛను పంపిణీకి డిసెంబరు 1వ తేదీ సెలవు కావడంతో ఒకరోజు ముందే శనివారం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. డిసెంబరు నెలలో 2,73,881 మంది పింఛను పంపిణీ చేయవలసి ఉండగా శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు 2,56,202 పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.



మాయాపట్నం-సూరాడపేట సముద్ర కోతను పరిశీలిస్తున్న వర్మ

ఇళ్లు కోల్పోయిన మత్స్యకారులకు స్థలాలు, ఇళ్ల నిర్మాణం

- మాజీ ఎమ్మెల్యే వర్మ

కొత్తపల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో సముద్రకోతకుగురై ఇళ్లు కోల్పోయిన తీరప్రాంత మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరుచేసి గృహాలను నిర్మిస్తుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ తెలిపారు. సముద్ర కెరటాల ధాటికి కోతకు గురైన ఉప్పాడ, మాయాపట్నం, అమీనాబాద్, సూరాడపేట, జగ్గరాజుపేట, కొత్తపట్నం, సుబ్బంపేట తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారుల గృహాలను ఆయన శనివారం పరిశీలించారు. సముద్ర కెరటాలు మత్స్యకారుల ఇళ్ల కింద నుంచి కోసుకుంటూ పోతున్నాయని, ఉప్పాడ నుంచి కోనపాపపేట తీరప్రాంత రక్షణకు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రూ.250 కోట్లు వెచ్చించి జియోట్యూబ్ నిర్మాణం చేపట్టేందుకు సుముఖంగా ఉన్నారని వర్మ తెలిపారు. ఇళ్లు కోల్పోయిన మత్స్యకారులందరికీ కొమరిగిరి లేఅవుట్లో ఇంటి పట్టాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలకు రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ కొత్తపల్లి మండల అధ్యక్షులు అనిశెట్టి సత్యానందరెడ్డి, మత్స్యకార నాయకులు చోడిపల్లి ప్రసాద్, రాచపల్లి సనపయ్య, కొవ్విరి రాంబాబు, మూగి సత్యవతి, ఓసిపల్లి అప్పన్న, తిక్కాడ తాతారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

బీచ్ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్రతీరంలో ఉన్న బీచ్ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా మలిచేందుకు చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన, జేసీ రాహుల్‌మీనాతో కలిసి రెవెన్యూ, పర్యాటకం తదితర అధికారులతో నూతన ప్రాజెక్టు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చుట్టుపక్కల నుంచి కాకినాడ సముద్రతీర ప్రాంతానికి రోజు వేలాదిమంది సందర్శకులు వస్తూ ఉంటారన్నారు. తీరంలోని వాకలపూడి వద్ద ఉన్న బీచ్ పార్కు, కుడా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎయిర్ క్రాఫ్ట్‌ను డిసెంబరు 20 నాటికి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో సత్యదేవుడి వ్రతాలు

కార్తీకమాసం ఒకరోజు మిగిలి ఉండగానే 1,44,785 వ్రతాలు - 7లో



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డీఈవో పి రమేష్ తదితరులు

జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ గోడపత్రిక ఆవిష్కరణ

కాకినాడ రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3న నిర్వహించే జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్‌ను జయప్రదం చేయాలని డీఈవో పి.రమేష్ సూచించారు. ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ సంచాలకులు పి.స్రవంతి ఆదేశాల మేరకు ఏపీఎస్‌జీసీ, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎస్జీసీ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఎండీ ఎంఏడీ నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి ఎం.వెంకట్రావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌వినీల్ పాల్గొన్నారు.



నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

హెచ్‌ఐవీ నిర్మూలనకు చైతన్యమే చికిత్స

● విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ● అందుబాటులో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సేవలు ● ఏటేటా తగ్గుతున్న పాజిటివ్ కేసులు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 29, (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఎయిడ్స్ పేరు చెబితే వణికిపోయేవారు. ఎయిడ్స్ మహమ్మారిన పడిన బాధితులపై సమాజంలో తీవ్ర వివక్ష ఉండేది. ఎయిడ్స్‌తో మరణాలు అధికంగా ఉండేవి. ఎయిడ్స్ వ్యాధి విస్తరణపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో ఏటేటా రోగుల సంఖ్య తగ్గుతోంది. ఎయిడ్స్ బాధితుల నుంచి చిన్నారులకు సోకకుండా ముందస్తు వైద్య ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చిన్నారులకు సైతం పాజిటివ్ సంఖ్య తగ్గినట్టు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచడం, ఈ వ్యాధితో మృతి చెందినవారిని స్మరించుకోవడం, ఎయిడ్స్ వ్యాధి కారక హెచ్‌ఐవీకి వ్యతిరేకంగా పోరాడటం కోసం ఏటా డిసెంబరు 1వ తేదీన ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం జరుపుకుంటున్నాం. ఎయిడ్స్ అనేది స్వలింగ సంపర్కం, రక్షణ లేని విధంగా ఇతరులతో సెక్స్ వర్కర్లతో సెక్స్‌లో పాల్గొనడం, మాదకద్రవ్యాల వాడకం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా విటులు, దూరప్రాంతాలకు డ్రైవింగ్ చేసే డ్రైవర్లు, వలసలకు వెళ్లిన వారు సెక్స్ వర్కర్లతో కండోమ్ లేకుండా సెక్స్‌లో పాల్గొనడం ద్వారా ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ఎయిడ్స్, హెచ్‌ఐవీపై విస్తృతంగా అవగాహన పెరగడంతోపాటు వైరస్‌ను సమర్థంగా తిప్పికొట్టే నాణ్యమైన ఏఆర్‌టీ మందులు అందుబాటులోకి వచ్చాయి. ఈ మందులను ప్రభుత్వమే ఉచితంగా ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా బాధితులకు పంపిణీ చేస్తోంది. బాధితుల జీవన ప్రమాణ స్థాయి, నాణ్యమైన ఆరోగ్యం కోసం దాతలు, సంస్థలు పౌష్టికాహారం పంపిణీ చేయడంతో బాధితుల ఆరోగ్య స్థాయి పెరిగింది.

హెచ్‌ఐవీ అంటే..

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రెండు ఒకేటేనని భావిస్తుంటారు. హెచ్‌ఐవీని నిరక్ష్యం చేస్తే అది ఎయిడ్స్‌గా మారుతుంది. హెచ్‌ఐవీ అనేది హ్యూమన్ ఇమ్యునో డెఫిసియెన్సీ వైరస్. ఇది శరీరంలోని రోగ నిరోధకశక్తిని నిర్వీర్యం చేస్తోంది. సీడీ-4 కణాలపై దాడి చేసి రోగనిరోధకశక్తిని హరిస్తోంది. దీంతో పలు రకాల అంటు రోగాలు సంక్రమిస్తాయి. కేన్సర్ బారినపడే ప్రమాదం ఉంది. హెచ్‌ఐవీ సోకిన కొన్నాళ్ల వరకు ఎటువంటి లక్షణాలు కనిపించవు. దాంతో దాంపత్య జీవితం గడపడంతో ఇది విస్తరిస్తోంది.

ఎలా సోకుతుంది...

హెచ్‌ఐవీ రక్తం, చనుబాలు, వీర్యం, జననాంగ స్రావాల ద్వారా ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది. నాలుగు మార్గాల ద్వారా ఇది సోకుతుంది. అసురక్షిత సంభోగం, ఓరల్ సెక్స్, సిరలోకి మాదక ద్రవ్యాల ఇంజెక్షన్లు, హెచ్‌ఐవీ సోకిన వారి రక్తమార్పిడి, తల్లి నుంచి బిడ్డకు సంక్రమిస్తోంది. గర్భిణీలకు ముందుగానే హెచ్‌ఐవీ పరీక్ష చేయడంతో యాంటీ రెట్రోవైరల్ (ఏఆర్‌వీ) మందులతో తల్లి నుంచి బిడ్డకు సోకకుండా చేయవచ్చు. జిల్లాలో డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణ కోసం కృషి చేస్తున్నారు. 1987 డిసెంబరు 1వ తేదీన దేశంలో మొట్టమొదటి హెచ్‌ఐవీ కేసును గుర్తించారు. ఈ ఏడాది ఎయిడ్స్ దినం హక్కుల మార్గాన్ని అనుసరించండి- నా ఆరోగ్యం, నాహక్కు అనే నినాదంతో ముందుకు వెళుతున్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినం సందర్భంగా ఎయిడ్స్ నిర్మూలనే ధ్యేయంగా అవగాహన కల్పించే దిశగా పయనించాల్సి ఉంది.

అక్టోబరు నాటికి కాకినాడ జిల్లాలో జనరల్, గర్భిణీలకు చేసిన హెచ్‌ఐవీ పరీక్షలు ఇలా..

సంవత్సరం	పరీక్షల సంఖ్య	పాజిటివ్‌కేసులు	శాతం	గర్భ పరీక్షలు	పాజిటివ్	శాతం
2022-23	78,592	1078	1.4	55,693	29	0.05
2023-24	63,736	1011	1.6	63,106	36	0.06
2024-25	44,745	632	1.4	28,095	13	0.05

కాకినాడ జిల్లాలో ఉన్న ఏఆర్‌టీ సెంటర్లలో చికిత్స పొందుతున్న బాధితులు

ఏఆర్‌టీ సెంటర్	పురుషులు	మహిళలు	టీఎస్/టీజీ	బాలురు	బాలికలు	మొత్తం
ఏఆర్‌టీ సెంటర్,జీజీహెచ్	5,370	6879	79	243	250	12,812
ఏఆర్‌టీ సెంటర్,తుని	1669	1927	24	47	71	3738
మొత్తం	7039	8806	103	290	321	16,559

'హక్కుల మన్ననను ఎంచుకుందాం..'



ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఏటా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక్కో నినాదాన్ని ప్రకటిస్తుంది. ఇందులో భాగంగా 2024కి సంబంధించి హక్కుల మన్ననను ఎంచుకుందాం (టేక్ ద రైట్స్ పాత్ టు ప్రీవెంట్ ఎయిడ్స్) నినాదాన్ని ఇచ్చింది. సమాజంలోని ప్రతి ఒక్కరి హక్కులను గౌరవించడం ద్వారా ప్రపంచంలో ఎయిడ్స్‌ను అంతం చేయవచ్చనే ఉద్దేశంతో ఈ నినాదాన్ని ప్రకటించారని ప్రముఖ ఎయిడ్స్ వైద్య నిపుణుడు డాక్టర్ యనమదల మురళీకృష్ణ చెప్పారు. మానవ హక్కుల మన్ననతో, వివిధ సమాజాల నాయకత్వంలో 2030 నాటికి ప్రపంచం ఎయిడ్స్‌ను ప్రజారోగ్య ముప్పుగా అంతం చేయగలమని లక్ష్యంతో పనిచేయాల్సి ఉందని తెలిపారు.

ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం రావాలి



హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ముప్పు తొలగిపోలేదు. ఇప్పటికీ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 5 లక్షల మంది ఉండగా, 20 శాతం మంది రెండు తెలుగు రాష్ట్రాల్లోనే బాధితులు ఉన్నారు. హెచ్‌ఐవీ దీర్ఘకాలిక వ్యాధి. ఏఆర్‌టీ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడం ద్వారా వ్యాధి తగ్గి, ఆరోగ్యం మెరుగుపడడంతో సాధారణ జీవనం సాగిస్తున్నారు. హెచ్‌ఐవీ నుంచి ఎయిడ్స్‌గా ఇది రూపాంతరం చెందుతుంది. ప్రధానం సెక్స్ ద్వారా ఇది సోకుతుంది. మాదక ద్రవ్యాలు, సెక్స్ వర్కర్లతో వ్యాప్తిచెందుతోంది. విద్య, ఆరోగ్యం ప్రజల హక్కు, వైద్యం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడం, మహిళలు, ట్రాన్స్‌జెండర్స్ హక్కులను కాపాడగలిగితే వ్యభిచార గృహాలకు వెళ్లకుండా నివారించడం ద్వారా ఎయిడ్స్‌ని నివారించవచ్చు. జీవితభాగస్వామితో తప్పించి సెక్స్ వర్కర్లు, ఇతరులతో సెక్స్‌కు పాల్పడరాదు. కండోమ్‌తో సెక్స్ ద్వారా ఈ వ్యాధి బారిన పడకుండా కొంత మేర సంరక్షించుకోవచ్చు. తల్లి నుంచి బిడ్డకు సోకకుండా వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఎయిడ్స్‌ని నివారించవచ్చు. అవగాహనతో నియంత్రణ చేయవచ్చు.

- డాక్టర్ యనమదల మురళీకృష్ణ, హెచ్‌ఐవీ, దీర్ఘకాలిక వ్యాధుల నిపుణులు, కాకినాడ

పెళ్లికి ముందు హెచ్‌ఐవీ పరీక్ష శ్రేయస్కరం



పెళ్లికి ముందు మరో స్త్రీ లేదా ఎక్కువ మంది స్త్రీలతో లైంగిక సంబంధమైన సాన్నిహిత్యం కలిగి ఉంటే హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవడం శ్రేయస్కరం. టీబీ ఉన్నవారు, గర్భిణీలు కూడా హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవాలి. హెచ్‌ఐవీ పాజిటివ్ వచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచి ఏఆర్‌టీ సెంటర్లలో ఖరీదైన మందులు ఉచితంగా ఇవ్వబడతాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధితులను వివక్ష లేకుండా అందరితో సమానంగా ఆదరించమని అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇది దీర్ఘకాలిక వ్యాధి. దీనికి మందులున్నాయి. బాధితులను ఆదరిస్తూ వారి చేత క్రమం తప్పకుండా మందులు వాడిస్తే వారి జీవన విధానం మెరుగుపడడంతోపాటు వారి జీవిత కాలం పెరుగుతుంది.

- డాక్టర్ రోణంకి రమేష్, కాకినాడ జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి

ఔషధ మొక్కల పెంపకం లాభదాయకం

● ఉద్యానవన విశ్వవిద్యాలయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు

వై.రామవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కల పెంపకం చేపట్టాల్సిన మెళకువలపై ఉద్యానవన విశ్వవిద్యాలయ పరిశోధన కేంద్రం(వెంకటరామన్నగూడెం)శాస్త్రవేత్తలు శనివారం మండలంలోని తోటకూరపాలెంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ టి.నాగలక్ష్మి, డాక్టర్ జి.రంగన్న, డాక్టర్ ఎస్.ఆదర్శ ఔషధ గుణాలున్న అశ్వగంధ మొక్కలు సాగుచేసే విధానంపై మెళకువలు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వీటిని సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని వాటిని మార్కెటింగ్ చేసే విధానంపైన రైతులకు అవగాహన కల్పించారు. ఎస్ఏఎఫ్ కోఆర్డినేటర్ కె.సతీష్, సభ్యులు సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నమ్ములు, వైఎస్ఆర్ విశ్వవిద్యాలయ పరిశోధకులు, రైతులుపాల్గొన్నారు.

గోవిందా.. గోవింద

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.45.44లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర ఆర్జిక సేవలు నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. సినీనటుడు దివంగత రెబల్‌స్టార్ కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కార్తీక ఆఖరి శనివారం కావడంతో వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించారు.అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.45.44252 లభించినట్టు ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



సుప్రభాత సేవలో భక్తులకు స్వామివారి హారతి చూపిస్తున్న అర్చకులు



సినీనటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం



శిక్షణకు హాజరైన అధికారులతో అటవీశాఖ అధికార్లు

అన్ని నర్సరీలకు అక్రిడిటేషన్ తప్పనిసరి

టీఓఎఫ్ఐ రాష్ట్ర కోఆర్డినేటర్ అజిత్ చోనాచలం

దివాన్‌చెరువు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయం మేరకు రాష్ట్రంలోని అన్ని నర్సరీలు తప్పక అక్రిడిటేషన్ పొందాలని ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా (టీఓఎఫ్ఐ) రాష్ట్ర కోఆర్డినేటర్ అజిత్ చోనాచలం అన్నారు. దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో రాష్ట్రంలోని ఆగ్రో ఫారెస్ట్రీ నర్సరీలకు అక్రిడిటేషన్ ప్రొటోకాల్‌పై రెండురోజులు ఇచ్చిన శిక్షణ శనివారం ముగిసింది. నర్సరీలకు అక్రిడిటేషన్ రేటింగ్ ఇవ్వడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగ్రో ఫారెస్ట్రీ చెట్ల ప్రాధాన్యం, ప్రస్తుతం సప్లై డిమాండ్, సరఫరా అంతరాన్ని వివరించారు. అటవీ అకాడమీ డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ నర్సరీ అక్రిడిటేషన్ ప్రాముఖ్యతను, నాణ్యమైన ప్లాంటింగ్ మెటీరియల్ ఉత్పత్తి గురించి వివరించారు. ఐసీఏఆర్-సీఏఎఫ్ ఆర్ఐ శాస్త్రవేత్త సురేష్‌రమణన్, స్టైట్ సిల్వికల్చరిస్ట్ శ్రీనివాస్ ప్రసంగించారు. టీఓఎఫ్ఐ బృందం నుంచి బాలచిన్నపారెడ్డి, ప్రతాప్,సతీష్, ప్రణీత్, ప్రవీణ్ కార్యక్రమ నిర్వహణకు హాజరయ్యారు. రాష్ట్రంలో నలు మూలాల నుంచి అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ విభాగాలకు చెందిన 23 మంది అధికారులు శిక్షణలో పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తాం

● నీటి పారుదల శాఖమంత్రి రామానాయుడు



మంత్రి రామానాయుడుతో మాట్లాడుతున్న పోలవరం నిర్వాసితులు

దేవీపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని నీటి పారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు నిర్వాసితులకు హామీ ఇచ్చారు. శనివారం దేవీపట్నం గ్రామానికి చెందిన కొంతమంది నిర్వాసితులు పాలకొల్లులోని మంత్రి నివాసానికి వెళ్లి 44నిర్వాసిత గ్రామాలకు సంబంధించి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ముఖ్యం గా గోకవరం గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలో ఉన్న దేవీపట్నం కాలనీ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కోర్టులో ఉన్న తొమ్మిది ఎకరాలు సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిం చి త్వరలోనే కాలనీలను సందర్శిస్తానన్నారు. ఈ కార్యక్రమంలోసిద్ద అన్నహర్ష, సిద్ద రామకృష్ణ, లంక హరిశ్చంద్రుడు, గేదెల చినసుబ్బారావు, దొడ్డ సింహాద్రి, సిద్దా వెంకట నారాయణస్వామి, తిరుమలశెట్టి శ్రీనివాస్, కుంచనపల్లి రోజా, రొంగల రామచంద్రరావు, లింగంపల్లి సాయిఅచ్యుతరామయ్య ఉన్నారు.



నౌకలో పట్టుబడ్డ రేషన్ బియ్యం (ఫైల్‌ఫోటో)

రేషన్ మాఫియాలో వణుకు

- కాకినాడ పోర్టులో విదేశాలకు బియ్యం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదంతో గజగజ
- 16 షిప్పింగ్ కంపెనీలు అక్రమ బియ్యం వ్యాపారంలో కోట్లలో ఆర్జన
- మొత్తం కూపీ లాగుతుండడంతో ఎక్కడ దొరికిపోతామోనని కలవరం
- అటు బియ్యం అక్రమార్కులను వదిలేదిలేదన్న సీఎం హెచ్చరికతో బెంబేలు
- మాఫియాకు సహకారంపై పవన్ నిలదీతతో అధికారుల్లో వణుకుపాటు
- జిల్లా ఎస్పీపై పవన్ శివాలెత్తడంతో బదిలీ వేటు ఖాయమంటూ ప్రచారం
- డీఎస్‌వోపై కలెక్టర్ బదిలీ వేటుతో పౌరసరఫరాల శాఖలో గుబులు

రేషన్ బియ్యం మాఫియాపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదంతో అక్రమార్కులు అల్లాడుతున్నారు. తమ మాఫియా పునాదులు ఎక్కడ బయటపడిపోతాయోనని బెంబేలెత్తుతున్నారు. గడచిన అయిదేళ్లు అప్పటి వైసీపీ సర్కారు అండతో కోట్లు సంపాదించిన కొందరు వ్యాపారులైతే వణికిపోతున్నారు. ప్రభుత్వం మొత్తం కూపీ లాగుతుండడంతో బండారం బయటపడి కటకటాలకు వెళ్లాల్సి వస్తుందని కలవరపడుతున్నారు. ఇప్పటికే చెక్‌పోస్టులు ఏర్పాటుచేయడంతోపాటు రాత్రి నిఘా పెంచడంతో రేషన్ ఎగుమతికి దారులు మూసుకుపోయినట్టేనని గింజుకుంటున్నారు. 16 కంపెనీలు దందా కొనసాగిస్తున్నాయని, ఈ నెట్‌వర్క్ అంతుచూస్తామని తాజాగా డిప్యూటీ సీఎం పవన్ హెచ్చ రికలతో పరిణామాలు ఎంతవరకు వెళ్తాయోనని గజగజలాడుతున్నారు. అటు రేషన్ అక్రమార్కులను వదిలిపెట్టబోయేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరికలతో బెంబేలెత్తుతున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పేదలకు పంచే రేషన్‌బియ్యాన్ని కాకినాడ కేంద్రంగా అక్రమార్కులు విదేశాలకు స్మగ్లింగ్ చేస్తూ ఏళ్ల తరబడి దర్జాగా సంపాదిస్తున్నారు. ప్రధానంగా కాకినాడ వైసీపీ కీలకనేత అయిన ద్వారంపూడి కుటుంబం, ఆయన అనుచరులు అడ్డుఅదుపూ లేకుండా గడచిన అయిదేళ్లలో అరాచకం సృష్టించారు. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి ప్రత్యేక నెట్‌వర్క్‌తో రేషన్‌బియ్యాన్ని కిలో ఆరు నుంచి పది వరకు కొనుగోలు చేసి కాకినాడ గోదాముల్లో లక్షల టన్నులు నిల్వ చేశారు. వీటిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా తమ అనుచరులు, సామాజికవర్గ మిల్లుల్లో గుట్టుచప్పుడు కాకుండా పాలిష్ చేసి ఆఫ్రికా దేశాలకు కాకినాడ యాంకరేజ్ పోర్టుమీదుగా తరలించేశారు. రేషన్ బియ్యాన్ని పాలిష్ ద్వారా మెరిసేలా చేసి ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి దేశాలకు దేశాలు దాటించేశారు. అక్కడ కిలో రూ.70కి విక్రయించి కోట్లకుకోట్లు కొల్లగొట్టేశారు. ఒకరకంగా చెప్పాలంటే పది లక్షల పెట్టుబడికి రూ.25 లక్షలు సంపాదించారు. అయితే కూటమి ప్రభుత్వం రాకతో వీరి నెత్తిమీద పిడుగు పడినట్టయింది. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే కాకినాడ, చుట్టుపక్కల గోదాముల్లో ఏకంగా రూ.157 కోట్ల విలువచేసే 52 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం పట్టుకుంది. దీంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. ఇన్నాళ్లు గోదాములు, మిల్లుల్లో ఇష్టానుసారం పాలిష్, ప్యాకింగ్ చేసిన దొంగలు ఒక్కసారిగా బెంబేలెత్తారు. అటు పోర్టు వద్ద రెండు చెక్‌పోస్టులు ఏర్పాటుచేయడంతో దందా ఆగిపోతుందేమోనని భావించారు. కానీ ఎత్తుగడతో చెక్‌పోస్టు సిబ్బందిని కాసులతో కొట్టేసి రేషన్ బియ్యం ఎగుమతి చేయడానికి ప్రయత్నించారు. తీరా అడ్డంగా నౌకలోను, బార్జిలోను రేషన్ బియ్యం దొరికిపోవడంతో కంగుతిన్నారు. స్వయంగా డిప్యూటీ సీఎం కాకినాడకు శుక్రవారం వచ్చి వీటిని పరిశీలించి 16 మంది బియ్యం ఎగుమతిదారులు రేషన్ స్మగ్లింగ్‌ను సామ్రాజ్యంలా నడిపిస్తున్నారని చెప్పడంతో ఇప్పుడు వీరంతా ఉలిక్కిపడుతున్నారు. ఈ నెట్‌వర్క్ తనను సైతం కాకినాడకు రాకుండా అడ్డుకోగలిగిందని చెప్పిన పవన్ దీన్ని వదిలిపెట్టనని, బియ్యం రవాణాపై పీడీ కేసులతోపాటు సీఐడీ లేదా సీబీఐతో స్మగ్లింగ్‌ను వెలికి తీస్తామని హెచ్చరించడంతో మున్ముందు తమ అక్రమ రవాణా ఎక్కడ బండారం బయటపడుతుందోనని వణికిపోతున్నారు. ఈనేపథ్యంలో భవిష్యత్తులో విచారణ జరిగితే ఎక్కడా దొరకకుండా ఉండేందుకు తమ వద్ద రికార్డుల సాక్ష్యం లేకుండా జాగ్రత్తపడుతున్నారు. అటు ఢిల్లీస్థాయిలోను లాబీయింగ్‌కు ప్రయత్నాలు మొదలు పెట్టారు. వాస్తవానికి వైసీపీ అయిదేళ్ల పాలనలో కాకినాడ యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టు నుంచి రూ.950 కోట్ల విలువైన బియ్యం ఎగుమతులు జరిగాయి. ఇందులో సగానికిపైగా రేషన్ బియ్యం వ్యాపారమేనన్న అనుమానాలు ఉన్నాయి. దీంతో ఇదంతా నిగ్గుతేల్చడానికి ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రధానంగా ద్వారంపూడి సోదరుడు, ఆయన అనుచరులు తాజా పరిణామాలతో గజగజలాడుతున్నారు. ప్రధానంగా సరళా కంపెనీ పేరుతో బియ్యం ఎగుమతి చేసిన వినోద్ అగర్వాల్‌ను ఉద్దేశించి హరాఈజ్ అగర్వాల్ అంటూ పవన్ బహిరంగంగా నిప్పులు కక్కడంతో సదరు వ్యాపారి బెంబేలెత్తిపోతున్నాడు. ఇలా అనేకమంది అక్రమార్కులు తాజా పరిణామాలతో ఏంచేయాలో తెలియక కలుగుల్లోకి దూరిపోతున్నారు. పైగా కాకినాడ రేషన్ స్మగర్లను వదిలిపెట్టనంటూ సీఎం చంద్రబాబు శనివారం హెచ్చరించడంతో ప్రభుత్వం ఈ మాఫియా పీచమణచడానికి ఎలాంటి అడుగులు వేస్తుందోనని తలపట్టుకుంటున్నారు.

వేటు ఎవరిపైనో...

రేషన్ స్మగ్లింగ్ మాఫియాకు కొందరు అధికారులు సహకరించడంపై పవన్ శుక్రవారం పోర్టులో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరుగా జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను ఉద్దేశించి పోర్టులో పరిణామాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించినా కనీసం స్పందించలేదని శివాలెత్తారు. తాను వచ్చిన ప్రతిసారీ ఎస్పీ సెలవులో వెళ్లిపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. అటు ఎస్పీ పనితీరుపై ఏమాత్రం సంతృప్తిగా లేని పవన్ సమర్థుడైన అధికారిని తేవాలనే ఆలోచనతో ఉన్నారు. ఈనేపథ్యంలో ఒకటిరెండు రోజుల్లో ఎస్పీపై వేటు వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కాకినాడ డీఎస్పీపైనా పవన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాఫియాను అడ్డుకోకుండా ఏంచేస్తున్నారని ధ్వజమెత్తగా ఆయన నీళ్లు నమిలారు. దీంతో డీఎస్పీ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోపక్క పౌరసరఫరాలశాఖలో అడుగడుగునా మాఫియాకు సహకరించేవారు అధికంగా ఉండడంతో పోర్టు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు అవినీతిమయంగా మారాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం రావడంతో కలెక్టర్ స్పందించి జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిపై బదిలీ వేటు వేశారు. దీంతో ఆ శాఖలో మిగిలినవారిలో వణుకు మొదలైంది. పాపాలకు ఫలితంగా ఎవరి కొలువుపై వేటు పడుతుందోననే చర్చ జరుగుతోంది. కాగా బార్జి, నౌకలో పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని శాంపిళ్లు తీసి అధికారులు ల్యాబ్‌కు పంపించారు.

అనుమానం రాకుండా... చేశారా..

తుపాను నేపథ్యంలో వర్షాలు కురుస్తుండడంతో పట్టుబడ్డ బియ్యాన్ని అధికారులు బార్జి, నౌకలోనే వదిలేశారు. కాగా జూలైలో పట్టుబడ్డ ఈ రేషన్ బియ్యాన్ని సదరు వ్యాపారులు న్యాయస్థానం ద్వారా బ్యాంకు గ్యారెంటీలు చెల్లించి విడిపించి తెచ్చుకున్నారు. ఈలోపు ఇంతలో అదే బియ్యాన్ని మళ్లీ విదేశాలకు అంత ధైర్యంగా ఎలా ఎగుమతి చేస్తారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఆ బియ్యం విదేశాలకు వెళ్లడం నిషిద్ధం అయినప్పుడు అధికారుల్లో ఎవరి సహకారంతో ఇది దేశం దాటి వెళ్లడానికి ప్రయత్నం జరిగిందనేదానిపై చర్చ జరుగుతోంది. అయితే విడిపించుకున్న ఈ బియ్యాన్ని సదరు స్మగ్లర్లు మిల్లుల్లో మళ్లీ పాలిష్ చేసి ఇతర బియ్యంతో మిక్సింగ్ చేసి అనుమానం రాకుండా విదేశాలకు ఎగుమతి చేయడానికి ప్రయత్నించారు. ఈలోపు కలెక్టర్ శాన్‌మోహన్‌కు అనుమానం వచ్చి తనిఖీచేయడంతో బండారం బద్ధలైంది.

బియ్యం శాంపిల్స్ పరీక్షిస్తున్నాం

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ యాంకరేజ్ పోర్టులో నౌకలో సేకరించిన బియ్యం శాంపి ల్స్‌ను ల్యాబ్‌కు పంపి పరీక్షిస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి డీఎస్‌వో ప్రసన్న లక్ష్మీదేవి తెలిపారు. అలాగే కరప మండలం నడకుదురులో సీజ్ చేసిన బియ్యాన్ని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌లో ఉంచామన్నారు. ఫలితాలు వచ్చిన తర్వాత పీడీఎస్ బియ్యం ప్రకటిస్తామన్నారు.

రేపటి నుంచి మాధవపట్నం రైలు గేటు మూసివేత

సామర్లకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-కాకినాడ ప్రధాన రైలుమార్గంలో సర్పవరం రైలు గేటుగా గుర్తింపు పొందిన మాధవపట్నం రైలు గేటును డిసెంబరు 2నుంచి 11వరకూ మూసివేయనున్నట్లు కాకినాడ రైల్వే ఎస్ఎస్ఈ పబ్లిక్‌వే మూర్ని రమేష్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రైలుగేటు వద్ద ఎల్‌సీ పోర్షన్ ట్రాక్ రోడ్డు మరామ్మత్తుల దృష్ట్యా రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేయనున్నట్లు తెలిపారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

తూర్పుగోదావరి జిల్లా డీఈవో వాసుదేవరావు

బిక్కవోలులో ముగిసిన అంతర జిల్లాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు ప్రథమం, శ్రీకాకుళం ద్వితీయ స్థానాలు కైవసం



ప్రథమ స్థానం సాధించిన గుంటూరు బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఈవో

బిక్కవోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలు ప్రతి విద్యార్థికి అవసరమని తూర్పుగోదావరి జిల్లా విద్యా శాఖాధికారి పి.వాసుదేవరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో నిర్వహిస్తున్న 68వ అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 బాలికల పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో డీఈవో మాట్లాడుతూ క్రీడలకు గతంలో 2శాతం కోటా ఉండేదని దానిని కూటమి ప్రభుత్వం 3శాతానికి పెంచిందని, క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. తల్లిదండ్రులందరూ విద్యార్థుల చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలు సాధించిన గుంటూరు, శ్రీకాకుళం, విశాఖ, ప్రకాశం జట్ల బాలికలకు ఆయన ట్రోఫీలు అందజేశారు. క్రీడలు దిగ్విజయంగా నిర్వహించిన జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ. స్వామిని, పీడీ అసోషియేషన్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల అబ్జర్వర్ సీహెచ్ రజినీదేవి, హెచ్ఎం పి.వీరప్రభాకరరావు, పీడీ, పీఈటీ అసోషియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, గౌరవాధ్యక్షుడు నల్లమిల్లి అప్పారెడ్డి, అనపర్తి జోన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి టీవీ. రాఘవరెడ్డి, పీడీలు వై.బంగార్రాజు, మానుకొండ ధనరాజు, నందిపాటి శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, వీకేఆర్.తంబి, ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవో కె.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు...

ఫైనల్స్‌లో గుంటూరు-శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. గుంటూరు 35-27, 35-27 స్కోరుతో శ్రీకాకుళంపై విజయం సాధించి ప్రథమ స్థానం సాధించగా, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం పొందింది.. అలాగే విశాఖ. ప్రకాశం జట్టుపై 35-30, 35-31 స్కోరుతో గెలుపొంది ద్వితీయ స్థానం పొందగా ప్రకాశం జట్టు నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

సాఫ్ట్‌బాల్ విజేత విజయనగరం జిల్లా జట్టు

● ద్వితీయ స్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు ● ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



ట్రోఫీతో సాఫ్ట్‌బాల్ విజేత విజయనగరం జిల్లా బాలికల జట్టు



ద్వితీయ స్థానంలో నిలిచిన తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు

కాకినాడ రూరల్ నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం ముగిసినట్టు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎల్.జార్జ్ తెలిపారు. విజయనగరం జిల్లా జట్టు విజేతగా నిలవగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తృతీయస్థానంలో కడప జిల్లా జట్టు నిలిచింది. ఈ జట్ల నుంచి ఉత్తమ జట్టును ఎంపిక చేస్తారు. అలా ఎంపికైన జట్టు మహారాష్ట్రలో జనవరిలో జరిగే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటుంది. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, పీఈటీ సంఘ అధ్యక్షకార్యదర్శులు రవిరాజు,నూకరాజు చేతులమీదుగా విజేతలకు ట్రోఫీలను, పతకాలను అందజేశారు.

డివైడర్‌ను ఢీకొని ట్రాలీ లారీ బోల్తా

డ్రైవర్ పరారీ.. క్లీనర్‌కు స్వల్ప గాయాలు

రాజానగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రైలు చక్రాల లోడుతో వెళ్తున్న లారీ రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి విశాఖపట్నానికి రైలు చక్రాలతో వెళ్తున్న ట్రాలీ మార్గమధ్యలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో గైట్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొని సర్వీసు రోడ్డులోకి దూసుకొచ్చింది. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే సంఘటనా స్థలంలో ప్రమాద సమయంలో కళాశాల విద్యార్థులు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్ పరారీ కాగా క్లీనర్ కిందికి దూకడంతో స్వల్ప గాయాలయ్యాయి. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ మనోహర్ తెలిపారు.



గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో హైవేపై పడిన రైలు బండి చక్రాలు

కుక్కుటేశునికి రుద్రాభిషేకం

పిఠాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామికి శనివారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. కార్తీకమాసం పూజల్లో భాగంగా పత్రిపూజ జరిగింది. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠానికి అధిష్ఠాన దేవతైన పురుహూతికాఅమ్మవారు, రాజరాజేశ్వరీదేవిలకు కుంకుమపూజలు జరిగాయి. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పాదగయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

కనుల పండువగా

కోటివత్తుల దీపోత్సవం

శివనామస్మరణతో మార్మోగిన గొల్లప్రోలు

గొల్లప్రోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణం శనివారం రాత్రి శివనామస్మరణతో మార్మోగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం) వద్ద కోటివత్తుల దీపోత్సవం కనులపండువగా జరిగింది. 108మంది దంపతులు ఒక్కొక్కరు లక్ష వత్తుల కుందెలను వెలిగించారు. కోటివత్తుల దీపోత్సవంతో శివాలయం పరిసరాలు దేదీప్యమానంగా వెలుగులు చిందించాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గొల్లప్రోలు శివాలయం వద్ద నిర్వహించిన కోటివత్తుల దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

అపర్ణాదేవి అలంకారంలో సహస్ర దీపాలంకరణ

గొల్లప్రోలు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా నాగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శనివారం రాత్రి అపర్ణాదేవి అలంకారంలో సహస్ర దీపాలంకరణ చేశారు. వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రధాన అర్చకుడు ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆలయంలో నిర్వహించిన దీపాలంకరణ

రికార్డుస్థాయిలో సత్యదేవుడి వ్రతాలు

కార్తీకమాసం ఒకరోజు మిగిలుండగానే 1,44,785 వ్రతాలు

అన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయంలో ఈ ఏడాది కార్తీక మాస వ్రతాలు రికార్డుస్థాయిలో నమోదయ్యాయి. ఇప్పటివరకు కార్తీకంలో 2022లో జరిగిన 1,42,373 వ్రతాలు రికార్డుకాగా కార్తీకం ముగియడానికి ఒకరోజు ముందైన శనివారానికి 1,44,785 వ్రతాలు జరిగినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. వీటిలో 70శాతం వ్రతాలు రూ.300 ధరలోనివి కావడం విశేషం. ఈ ఏడాది కార్తీకమాసంలో బహుళ ఏకాదశి రోజున మాత్రమే 10,000 వ్రతాలు దాటగా మిగిలిన రోజుల్లోనూ రికార్డుస్థాయిలో వ్రతాలు జరగడం గమనించదగిన విషయం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది, వ్రత పురోహితులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారంతో కార్తీక మాసం ముగియనుండగా మరో 3వేల వ్రతాలు అదనంగా జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.



సత్యదేవుడి ఆలయంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు

శృంగారవల్లభస్వామి దర్శనానికి

పోటెత్తిన భక్తజనం





శృంగారవల్లభస్వామి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

పెద్దాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి దర్శనానికి భక్తులు శనివారం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,04,210, అన్నదాన విరాళాలు రూ. 61,968 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.6,960, తులాభారం, కానుకల ద్వారా రూ.350, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.27,015 వెరసి రూ.3,00,503 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 12 వేలమంది స్వామివారిని దర్శించుకున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు ఉన్నారు.

మోటారుసైకిల్‌ను ఢీకొన్న టిప్పర్ లారీ

మహిళ మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

గండేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో మహిళ మృతిచెందిన సంఘటన శనివారం కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్ళూరులో జరిగింది. గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన కర్ణం నాగరత్నం(58) యల్లమిల్లి నుంచి తాళ్ళూరు గుడికి వచ్చి దర్శనం అనంతరం మోటారుసైకిల్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా తాళ్ళూరు గ్రామ శివారున ఎదురుగా అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొంది. దీంతో మోటార్‌సైకిల్ నడిపే వ్యక్తి, ఆ వెనుక కూర్చున్న నాగరత్నం కిందపడిపోగా ఆమె తలపై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోవడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. దీనిపై ఆమె కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ యువి శివనాగబాబు సంఘటన ప్రదేశాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోర్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయోమయంలో బోట్ల నిర్వాహకులు

అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ అధికారుల కొత్త నిబంధనలు



పోచవరం బోట్ పాయింట్ దగ్గర ఉన్న పర్యాటక బోట్లు

విఆర్‌పురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ అధికారుల కొత్త నిబంధనలతో పాపికొండలు, పేరంటాలపల్లి విహార యాత్రకు వెళ్లే బోట్ల నిర్వాహకులు అయోమయంలో పడ్డారు. ఎన్నడూ లేని విధంగా 50 మంది పర్యాటకులు బోట్‌పై విహార యాత్రకు వెళ్లాలంటే బోట్ నిర్వాహకులు రూ.2500, 100 మంది పర్యాటకులతో విహార యాత్రకు బోట్ వెళ్తే రూ.4000 కట్టాలని అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ అధికారులు నోటీసులు జారీచేశారు. దీంతో బోట్ల నిర్వాహకులు మా పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బోట్ నిర్వాహకులు మాదిరెడ్డి సత్యనారాయణ, సూర్యప్రకాష్ రావు మాట్లాడుతూ పాపికొండలకు వచ్చే ప్రతి వాహనం దగ్గర ఫారెస్టు అధికారులు అభయ అరణ్యం పేరుతో రూ.50 నుంచి 100 వసూలు చేస్తున్నారని, ఇప్పుడు మాపై ఇంత భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం పర్యాటకం అంతంత మాత్రంగానే ఉందని, ఈ విషయంపై ఉన్నతస్థాయి అధికారులు స్పందించి అటవీశాఖ అధికారులు కొత్తగా పెట్టిన నిబంధనలను ఉపసంహరించుకోవాలని భద్రాద్రిబోట్ యూనియన్ తరుఫున కోరారు. ఈ విషయమై విఆర్‌పురం ఇన్‌చార్జి రేంజర్ అధికారి మూర్తిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అటవీశాఖ ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలతోనే పోచవరం బోట్ పాయింట్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాళ్లరేవు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ ఫైడా కాలేజీ సెంటర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందినట్టు కోరంగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. మారేడుమల్లి వెలమకోటకు చెందిన తుంబుడు సుబ్బారెడ్డి(24) కాకినాడలోని ఒక హోటల్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితులు పుట్టినరోజును యానాంలో చేసుకుని యానాం నుంచి తన ద్విచక్రవాహనంపై కాకినాడ వెళ్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ఫైడాకాలేజీ సెంటర్ వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో సుబ్బారెడ్డి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

జీఎస్ఎల్‌లో ఎఫ్ఏజీఐఈ ఈఆర్‌సీపీ కాన్ఫరెన్స్

రాజానగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎఫ్ఏజీఐఈ ఈఆర్‌సీపీ (ఫెలోషిప్ ఇన్ అడ్వాన్స్డ్ జీఐ ఎండోస్కోపి- ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ కొలాంజియో పాంక్రియోటో ఫోగ్రఫీ) కాన్ఫరెన్స్‌ను తూర్పుగోదావరి జిల్లా జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ ఐఏజీఈఎస్(ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటస్టెయినబుల్ ఎండో సర్జన్స్) కాన్ఫరెన్సులో 130 మంది మెడికల్ పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులు లాప్రోస్కోపిక్ సర్జరీల్లో శిక్షణ పొందుతున్నారన్నారు. అలాగే మరో 63మంది విద్యార్థులు, డాక్టర్లు ఎగువ ఉదరకోశం (అప్పర్ అబ్డామిన్), లివర్, గాల్ బ్లాడర్, పాంక్రియాస్ మొదలైన వాటికి ఎండో స్కోప్‌తో జరిపే పరీక్షలు, చికిత్సలకు సంబంధించి (ఫెలోషిప్ ఇన్ అడ్వాన్స్డ్ జీఐ ఎండోస్కోపి- ఎండోస్కోపిక్ రిట్రోగ్రేడ్ కొలాంజియో పాంక్రియోటోఫోగ్రఫి)శిక్షణ పొందుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కాన్ఫరెన్స్ సెక్రటరీ డాక్టర్ సమీర్ రంజన్ నాయక్(ఏపీ), సీనియర్ సర్జన్లు డాక్టర్ ఈశ్వరమూర్తి(తమిళనాడు), భవనీత్ సింగ్ భల్లా(పంజాబ్), సతీష్‌కుమార్ మిధా(జార్ఖండ్), సునీల్‌పోపట్(గుజరాత్); సిద్దేశ్ (కర్ణాటక), గోవిందరాజ్(తమిళనాడు), అరుణ్ కరియంపూడి(ఏపీ), గౌతమ్‌కుమార్(ఏపీ), వీవీ ఎంఎస్ శ్రీరామ్(ఏపీ) సర్జరీలు చేసి జూనియర్ డాక్టర్లకు నైపుణ్యాలు పెంపొందించారు.



అతిథులకు జ్ఞాపికలు అందజేస్తున్న చైర్మన్

చెరువులో పడి వ్యక్తి మృతి

గొల్లప్రోలు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు కోటలంకవారి చెరువులో పడి వ్యక్తి మరణించాడు. గ్రామానికి చెందిన ఉలవల వీరబాబు(47) శనివారం తెల్లవారుజామున చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. స్థానికులు గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. కాగా ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గొల్లప్రోలు పోలీసులు తెలిపారు.

బంగారం తాకట్టు వ్యాపారిపై దాడి

రాడ్‌తో కొట్టి పరారైన ఇద్దరు



గాయపడిన వ్యాపారి

రౌతులపూడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడిలో బంగారు తాకట్టు వ్యాపారి రేతు జనారిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేయగా తలకు గాయమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వ్యాపారి జనారి ఇంటి వద్ద నుంచి షాపునకు శనివారం ఉదయం 9గంటలు సమయంలో రాగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి షాపులోకి వెళ్లి జనారిపై రాడ్‌తో దాడి చేశారు. జనారి గాయాలతో బయటకు రాగా చుట్టుపక్కలవారు వెళ్లేసరికి బైక్‌పై ఆ ఇద్దరు పరారయ్యారు. అయితే శుక్రవారం కూడా ఉదయం ఆ ఇద్దరు బంగారం వస్తువు తాకట్టు పెట్టాము వడ్డీ ఎంత అయ్యిందో చూడాలని రాగా వ్యాపారి వస్తువు తాకట్టు పెట్టినప్పుడు ఇచ్చిన కార్డు తీసుకురావాలని చెప్పడంతో తరువాత రోజు రావాలని చెప్పాడు. దీంతో శనివారం ఆ ఇద్దరు మళ్లీ వచ్చారు. 10 నిమిషాలపాటు మాట్లాడారు. రాడ్‌తో బెదిరించగా నా దగ్గర ఏముంటే అది పట్టుకు పోండంటూ వ్యాపారి చెప్పినప్పటికీ రాడ్‌తో తలపై కొట్టడంతో వ్యాపారి బయటకు వచ్చి కేకలు వేయడంతో బైక్‌పై ఇద్దరు పారిపోయారు. వ్యాపారికి తలకు బలమైన గాయం కావడంతో రౌతులపూడి ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం బంధువులు కాకినాడ తరలించారు. కేసు నమోదు చేసి సీసీ ఫుటేజ్ అధారంగా విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

నడకుదురులో డెంగ్యూ కేసు నమోదు

కరప, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలంలోని నడకుదురు గ్రామంలో డెంగ్యూ కేసు నమోదుకావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్సీపేటకు చెందిన మాసా అర్జునరావు గ్రామ పంచాయతీలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 27న అతను తీవ్ర జ్వరం, తలపోటుతో బాధపడుతూ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. టెస్ట్ చేయగా డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కరప మండల వైద్యాధికారి డాక్టర్ రమావత్ శ్రీనివాసనాయక్ వైద్యసిబ్బందితో కలిసి ఎస్సీపేటలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను తెలుసుకుని వైద్యపరీక్షలు చేశారు. సర్పంచ్ డేగల లలితకుమారి, పంచాయతీ కార్యదర్శి కె.వారిజలు బాధితుడి ఇంట్లో ఫైరిత్రమ్ మందును పిచికారీ చేయించారు.



నడకుదురులో కెమికల్ స్ప్రేయింగ్ చేయిస్తున్న అధికారులు

భీమేశ్వరాలయంలో నాగబాబు సతీమణి ప్రత్యేక పూజలు

సామర్లకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, జనసేన పార్టీ నాయకుడు నాగబాబు సతీమణి పద్మజ బంధువులతో కలిసి శనివారం రాత్రి సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపారాధన పూజలు చేశారు. ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదరంగా స్వాగతం పలికారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు అందజేశారు.



భీమేశ్వరుడిని దర్శించుకుంటున్న పద్మజ

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

93.26 శాతం పింఛన్ల పంపిణీ

కరప, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శనివారం సాయంత్రానికి 93.26 శాతం మందికి పింఛన్లను పంపిణీ చేసినట్టు ఎంపీడీవో మట్టపర్తి అనుపమ తెలిపారు. 23 గ్రామ పంచాయతీల పరిధిలో 11,366మంది లబ్ధిదారులు వివిధ రకాల పింఛన్లను పొందుతుండగా వారిలో 10,600మందికి పింఛన్ల సొమ్మును బట్వాడా చేశామని పేర్కొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్డీ వెంకటకృష్ణ



పిఠాపురంలో మాట్లాడుతున్న వెంకటకృష్ణ

పిఠాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ యజమాన్యంలోని పాఠశాలలను తీర్చిదిద్దుదామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్డీ వెంకటకృష్ణ సూచించారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయడంపై ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ, ఎస్ఎస్ఏ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం, ఇంజనీరింగ్ అధికారులతో పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సర్వశిక్షాభియాన్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జేజేఎం, సోషల్ ఫారెస్ట్రీ, పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనా(రూఫ్ టాప్ సోలార్ ఫ్యానల్స్), పీఎం శ్రీ, అటల్ ఇన్నోవేషన్ మిషన్ తదితరాలను వినియోగించుకుని ఉన్నత పాఠశాలలను ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చు, యాక్షన్‌ప్లాన్ రూపకల్పనపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వెంకటకృష్ణ వివరించారు. అన్ని పాఠశాలలను ఆదరవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. వర్క్‌షాపులో గుర్తించిన అన్ని అంశాలను పరిష్కరిస్తే జనవరి 11వ తేదిన పవన్‌కల్యాణ్ ప్రారంభించే విధంగా ప్రణాళిక ఉండాలని సూచించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో అన్ని వసతులు, సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే వర్క్‌షాపు లక్ష్యమని తెలిపారు. వర్క్‌షాపులో డిప్యూటీ సీఎం పేషీ అధికారి శివరాం, జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఏ డీఈఈ వెంకట్రాజు, ఎంఈవోలు శ్యాంబాబు, వేణుగోపాల్, నారాయణదాసు, మూడు మండలాల ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు, ఏపీవోలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే



నిత్యావసర సరుకులు అందజేస్తున్న కొండబాబు

కాకినాడ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శనివారం 12వ డివిజన్ నూకాలమ్మ ఆలయ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వర్ణాంధ్ర కాలనీ అగ్నిప్రమాద బాధిత 15 కుటుంబాలకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, శ్రీ అభయ బ్లడ్ బ్యాంక్ ఫౌండేషన్ సహకారంతో దుప్పట్లు, బియ్యం, నిత్యావసర సరుకులు, వంట పాత్రలు, బకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్ మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత రమేష్ ఆధ్వర్యం వహించారు. తొలుత అగ్ని ప్రమాద స్థలాన్ని కొండబాబు పరిశీలించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వొమ్మి బాలాజీ, టీడీపీ నాయకులు ఎంఏ తాజుద్దీన్, కశింకోట చంద్రశేఖర్, తుమ్మల కొండలరావు, కడలి వెంకటరమణ, దిబ్బాడ పెదబాబు, గంపల లక్ష్మణరావు, దిబ్బాడ పోలరాజు తదితరులు ఉన్నారు.

'ఆదాయంపై విభాగాధికారులు దృష్టి సారించాలి'

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థకు వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయంపై రెవెన్యూ విభాగాధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ భావన రెవెన్యూ శాఖాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భావన మాట్లాడుతూ ఇంటి, కుళాయి, మున్సిపల్ దుకాణాలు, ఖాళీ స్థలాలపై పన్నులను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మొండిబకాయిదారులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఇంటి పన్ను బకాయిలు చెల్లించాల్సిన ఆరువేల మందికి, కుళాయిపన్ను చెల్లించాల్సిన ఏడు వేలమందికి నోటీసులు ఇచ్చి పన్ను బకాయిలు వసూలు చేయాలని సిబ్బంది తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మీటర్ టాప్స్‌దారులకు డిమాండ్ నోటీసులు ఇవ్వాలన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లో అద్దె చెల్లించని దుకాణదారులకు కూడా నోటీసులు ఇచ్చి షాపులు ఖాళీ చేయించాలని సూచించారు. అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తదితర సిబ్బంది ఉన్నారు.

పద్ధతి మార్చుకోండి..

ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో షాపుల నిర్మాణంపై కౌన్సిల్లో రగడ

పెద్దాపురం మున్సిపల్ అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం



సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్

పెద్దాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారుల తీరుపై పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం కూడా కౌన్సిల్‌కు ఏమీ చెప్పరా.. జీతాలు తీసుకుంటున్నారు కదా మీకు బాధ్యతలేదా.. ప్రజా సమస్యలు పట్టవా అంటూ మున్సిపల్ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పద్ధతి మార్చుకోవాలని, పట్టణంలో పలు సమస్యలు పరిష్కరించకపోడం ఏంటని మున్సిపల్ అధికారులను కౌన్సిల్లో నిలదీశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పట్టణంలో ఉన్న పలు సమస్యను కౌన్సిలర్లు ప్రస్తావించారు. కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, పప్పుల దుర్గారావు, త్సలికి సత్యభాస్కర్ మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో అనధికారికంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాల నిర్మాణంపై ధ్వజమెత్తారు. షాపుల నిర్మాణం చేపడితే అక్కడ పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందని, పలు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. షాపుల నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకుకోకుండా నిర్మాణాలు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని అధికారులను నిలదీశారు. మున్సిపాలీటికి ఆదాయం పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్టీసీ అధికారులకు లేఖ రాశామని టౌన్‌ప్లానింగ్ అధికారి మొక్కుబడిగా సమాధానం చెప్పారు. నోటీసులు జారీ చేస్తామని తప్పించుకునే ప్రయత్నం చేశారు. మున్సిపల్ అధికారుల సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో తక్షణమే నిర్మాణాలు నిలుపుదల చేయాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. అలాగే పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న శతాబ్ది పార్కు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, పార్కు ప్రధాన ద్వారాలు ఎందుకు తెరవడం లేదని ప్రశ్నించారు. పైగా కౌన్సిల్ సభ్యులకు తెలియచేయకుండా పార్కులో క్యాంటీన్ ఏర్పాటు చేయడంపై కమిషనర్‌ను నిలదీశారు. కనీస సమదుపాయాలు కూడా లేవని, దీంతో పార్కు వచ్చేవారు ఎంతో నిరాశ చెందుతున్నారన్నారు. పార్కు నిర్వహణను ప్రైవేటుకు ఇవ్వకూడదని, మున్సిపాలిటీనే నిర్వహణ బాధ్యతలను తీసుకోవాలన్నారు. అలాగే పట్టణంలో దోమలు పెరిగిపోయాయని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫాగింగ్ కూడా చేయకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ప్రకాశరావు, ఏఈ జీవప్రసాద్, ఆర్వో చంద్రశేఖర్, టీపీవో ఫణికుమార్, శానిటరీ ఇనస్పెక్టర్ ఆదినారాయణ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో అపార్ట్‌మెంట్ల కేటాయింపులో అవినీతి

వాడివేడిగా పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టిడ్కో అపార్ట్‌మెంట్లు కేటాయింపులో భారీ అవినీతి జరిగిందని, లబ్ధిదారుల జాబితాలను ఇష్టారాజ్యంగా మార్చివేశారని కౌన్సిలర్లు ఆరోపించారు. ఇందుకు ఇక్కడ సుదీర్ఘకాలం పనిచేసి బదిలీ అయిన టౌన్‌ప్లానింగ్ అధికారి కారణమని వారు మండిపడ్డారు. పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో శనివారం ఛైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వాడివేడిగా జరిగింది. టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారుల్లో 20మంది పేర్లను గత టీపీవో శ్రీనివాసరావు మార్చివేశారని, భారీగా డబ్బులు చేతులు మారాయన్నారు. ఈ సందర్భంగా జాబితా నుంచి తొలగించిన అర్హులైన లబ్ధిదారుల పేర్లను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అక్కడ ఒక్క పని చేయనప్పటికి అవినీతి మాత్రం జరిగిందని తెలిపారు. ఇదే విషయాన్ని పలువురు కౌన్సిలర్లు ప్రస్తావించారు. అక్కడ ఎంత మంది లబ్ధిదారులు ఉంటున్నారు. వారు నిజమైనా వారా, కాదా, అమ్మకాలు జరిగాయా తదితర అంశాలపై విచారణ జరపాలని కౌన్సిలర్లు బోను దేవ, పెదపాటి నాగేశ్వరరావు, సోమరౌతు లలిత, రాయుడు శ్రీను డిమాండ్ చేశారు. అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. దీనిపై కమిషనరు కనకారావు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో విచారణ జరిపి వివరాలు కౌన్సిల్ ముందు ఉంచుతామన్నారు.

పవన్ పర్యటనపై సమాచారం ఏది?

డిప్యూటీ సీఎం పవన్ పట్టణంలో పర్యటించడం శుభపరిణామమని, అయితే ఆయన పర్యటన సమాచారం కౌన్సిలర్లుకు ఉండటంలేదని కౌన్సిలరు పెదపాటి రాజేష్ అన్నా రు. కౌన్సిలర్లు చెప్పిన పనులు చేయకుండా డిప్యూటీ సీఎం చెప్పారని చేయడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. దీని వల్ల కౌన్సిల్‌కు విలువ లేకుండా పోతున్నదని వైస్‌ఛైర్మన్ పచ్చిమళ్ల జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. తన అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన అంశాలను తేడాగా నమోదు చేశారని మండిపడ్డారు. అగ్రహారంలో ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ అధికారులు జేసీబీలతో వెళ్లడంపై కౌన్సిలరు బోను దేవ ప్రశ్నించారు. అజెండాలోని 2అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

సమస్యలు పరిష్కరించాలని ఇంజనీరింగ్ వర్కర్ల ధర్నా

సమ్మెలోకి వెళ్తామని నోటీసు

పిఠాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జీతాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకుంటే డిసెంబరు 9వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని కమిషనర్ కనకారావుకు నోటీసు అందజేశారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న టెక్నికల్ వర్కర్లకు నెలకు రూ.29,200, నాన్ టెక్నికల్‌కు రూ.24,500 వంతున వేతనాలు ఇవ్వాలని, 15 ఏళ్ల పైబడిన సర్వీసు ఉన్న వారిని పర్మినెంట్ చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. 55 ఆదివారాలు, 17 జాతీయ,రాష్ట్ర పండుగల సెలవు దినాలను సెలవులుగా ప్రకటించాలని లేకుండా వేతన సెలవుగా పరిగణించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే తాగునీటి సరఫరా, వీధిలైట్లు, డ్రైవర్స్ సహా వివిధ విభాగాల్లోని ఉద్యోగులందరూ సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. అందోళనలో యూనియన్ నాయకులు పెంకే రాంబాబు, ఎం. అచ్చిరాజు, సురేష్, శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డు గ్రహీతకు సత్కారం



మల్లిఖార్జున్‌కు జ్ఞాపిక అందించి సత్కరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

సర్పవరం జంక్షన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత నాటక అకాడమీ నిర్వహించిన పోటీల్లో మేకప్ విభాగం నుంచి కాకినాడకు చెందిన బి.మల్లిఖార్జున్ జాతీయ స్థాయి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ పురస్కారం అందుకున్నారు. శనివారం సెట్రాజ్ సీఈవో కేఎస్ కాశీవిశ్వేశ్వరావు ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పురస్కారం అవార్డు గ్రహీత మల్లిఖార్జున్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ షాన్ మోహన్‌ను కలుసుకున్నారు. మల్లిఖార్జున్‌ని కలెక్టర్ ఘనంగా సత్కరించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో భరతనాట్యం, కూచిపూడి పోటీల్లో 2సార్లు రాష్ట్రస్థాయి పురస్కారం, మేకప్‌లో జాతీయ పురస్కారం అందుకున్నట్లు కలెక్టర్‌కు వివరించారు.

నేటి నుంచి ఆర్టీసీ ఏసీ బస్సుల్లో 10శాతం టికెట్ రాయితీ

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఈనెల 1వ నుంచి 31వతేదీ వరకు కాకినాడ డిపో నుంచి ప్రయాణించే హైదరాబాద్, కర్నూలు, తిరుపతి ఏసీ బస్సుల్లో పది శాతం టికెట్ ధరలో రాయితీ కల్పిస్తున్నట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు. ఈ రాయితీ ధరలు అన్ని రోజుల్లోను అందుబాటులో ఉంటుందన్నారు. రాయితీ కల్పించిన సర్వీసు రాత్రి సమయాల్లో 7గంటలకు హైదరాబాద్ నైట్‌రైడర్, 8గంటలకు హైదరాబాద్ వెన్నెల, 9గంటలకు హైదరాబాద్ అమరావతి, సాయంత్రం 5గంటలకు కర్నూలు ఇంద్ర, సాయంత్రం 6.15గంటలకు తిరుపతి ఇంద్ర సర్వీసులకు రాయితీ కల్పిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు డిపోలో సంప్రదించాలన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 30మందికి జరిమానా

కొత్తపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల కొత్తపల్లి పోలీసు స్టేషన్‌పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో తనిఖీల్లో మద్యం తాగి వాహనాలను నడిపిన 30మందికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున పిఠాపురం జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి విజయ రామేశ్వరి జరిమానా విధించారని కొత్తపల్లి ఎస్‌ఐ జీ.వెంకటేష్ శనివారం తెలిపారు.

ఎస్సీలపై దాడి చేసిన అగ్రకులాలవారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ మాదిగ, నాయకులు

కాకినాడ సిటీ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలో ఎస్సీ మాదిగ కులాల వారిపై అగ్రకులాల వారు దాడి చేసిన ఘటనపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ శనివారం కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నెల 31వ తేదీ దీపావళి రోజున పంచాయతీ రోడ్‌పై మాదిగ కులానికి చెందిన బాలుడు చిచ్చుబుడ్డి వెలిగించాడనే కారణంతో ఆ కుంటుబంలోని అందరిపై అగ్రకులాల వారు దాడి చేసి గాయపరిచారన్నారు. నెల రోజులు గడుస్తున్నా ఈఘటనపై జగ్గంపేట పోలీసులు చర్యలు తీసుకోకుండా నిందితులను కేసు నుంచి తప్పించి ప్రయత్నం చేస్తున్నారన్నారు. నిందితులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు బజ్జింగ సుధాకర్, నాయకులు మందపల్లి కృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నర్సింగ్ నూతన కార్యవర్గం



కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేస్తున్న దృశ్యం

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ (ఏపిజిఎన్ఏ)కు ఇటీవల కాకినాడ జీజీహెచ్‌లో జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఈ నర్సింగ్ నూతన కార్యవర్గం ఏపీ ఎన్‌జిఓ సంఘం నేతలతో కలిసి శనివారం కలెక్టర్ షాన్ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన కార్యవర్గాన్ని పరిచయం చేసుకున్నారు. వెంటనే స్పందించిన కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా నర్సులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా అందుకు తగ్గ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డా. జె.నరసింహనాయక్‌ను నర్సింగ్ నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. కార్యక్రమంలో నర్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బూరిగ విజయలక్ష్మి, సెక్రటరీ ప్రమోద, ఉపాధ్యక్షురాలు రాణి, ట్రెజరర్ పరమేశ్వరీ, ఏపి ఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు జి. రామ్ మోహన్, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ లేనిలోటు తీరనది

తాళ్లరేవు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు దున్నా సత్యనారాయణ మృతి పార్టీకి తీరనిలోటని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. శనివారం పత్తిగొంది గ్రామం సత్యనారాయణ నివాశంలో త్రిరత్న బౌద్ధదమ్మసంఘం ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, మాలకార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్‌కుమార్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావులు తదితరులు సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, ధూళిపూడి వెంకటరమణ, నడింపల్లి వినోద్ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో పూజలు

సామర్లకోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని శనివారం సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి చినుకులు పడుతున్నప్పటికీ జిల్లా నలుమూలలు, రాష్ట్రం నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో కాకినాడకు చెందిన వారణాసి రవిశర్మ దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామికి అర్చనలు నిర్వహించారు.

డిప్యూటీ సీఎం పవన్ ప్రశ్నలకు సీఎం సమాధానం చెప్పాలి

సర్పవరం జంక్షన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో జరుగుతోన్న బియ్యం అక్రమ రవాణాపై తనిఖీలకు వస్తానంటే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణిని అడ్డుకున్నది ఎవరో సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు. శనివారం వైద్యనగర్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాకినాడ పోర్టులో నౌకలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని తనిఖీచేసిన అనంతరం పవన్ లేవనెత్తిన విషయాలపై సీఎం స్పష్టత ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇరవై రోజుల్లో పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒకసారి తనిఖీలకు వెళ్లి పీడీఎస్ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారన్నారు. ఇటీవల పౌరసరఫరా సంస్థ ఛైర్మన్ సుధీర్ ఒకసారి, 4రోజులకిందట కలెక్టర్ పోర్టులో షిప్పులోకెళ్లి తనిఖీలుచేసి పీడీఎస్ బియ్యాన్ని గుర్తించాన్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని సివిల్ సప్లయి శాఖ స్వాధీనం చేసుకుందని, ఈబియ్యాన్ని మళ్లీ ఎందుకు బ్యాంకు ష్యూరిటీ చూపించిన తర్వాత ఎందుకు వదిలేశారో చెప్పాలన్నారు.

17మద్యం సీసాలు స్వాధీనం

కరప, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కరపలోని బెల్ట్‌షాపుపై శనివారం రాత్రి స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి క్వార్టర్(180ఎంఎల్) పరిమాణంలో గల 17మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళగిరి డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పుణ్యమంతుల అప్పలరాజును అరెస్ట్‌చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించామని ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వరరావు తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ, తాళ్లరేవు స్టేషన్ సిబ్బంది, ఎస్టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

కాకినాడసిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5న జరగాల్సిన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక మెక్లారిన్ హైస్కూల్‌లో ఎన్నికల సామగ్రి కేంద్రంలో ఏర్పాట్లను శనివారం కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లిబాబు పరిశీలించారు. జేఎన్‌టీయూ లైబ్రరీలోని రిసెప్షన్ కేంద్రంలో ఏర్పాట్లను సమీక్షించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్లలో షామియానాలు, విద్యుత్, ఇంటర్ నెట్, తాగునీరు, పారిశుద్ధ్యం, కౌం టింగ్‌కు సంబంధించి బారీ కేడింగ్, వాహ నాల పార్కింగ్ ఏర్పాట్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సెంటర్‌ను సూచించే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొల్లాబత్తులకు సత్కారం

కాకినాడసిటీ,నవంబరు30(ఆంధ్ర జ్యోతి): మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ కొల్లాబత్తుల అప్పారావును కాకినాడలోని ఆయన నివాసంలో శనివారం తుని నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా సన్మాన గ్రహీత అప్పారావు మాట్లాడుతూ త్వరలో జిల్లా వ్యాప్తంగా పర్యటించి ఎస్సీల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తుని నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు కూరపాటి రఘు, లంక సునీల్, నెమ్మది సత్యనారాయణ, బోరపాటి సత్యనారాయణ, కిరణ్ అనిల్, జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు బంగారు సత్యనారాయణ, కడారి నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీలు పాల్గొన్నారు.

ఛైర్మన్‌తో భేటీ



గొల్లప్రోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డుండి రమేష్‌ను పిఠాపురం నియోజకవర్గ టీడీపీ నేత కేదారశెట్టి నానాజీ శనివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

గొల్లప్రోలులో రుద్ర సహిత చండీహోమం

గొల్లప్రోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం)లో రుద్ర సహిత చండీహోమం శనివారం జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతిపూజ, హోమం, పూర్ణాహుతి జరిగాయి. 108మంది దంపతులు చండీహోమంలో పాల్గొన్నారు.

డాక్టర్ వీర్రాజుకు టైమ్స్ హెల్త్ ఎక్స్‌లెన్స్ అవార్డు

సర్పవరం జంక్షన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉత్తమ వైద్య సేవలకు గుర్తింపుగా కాకినాడ సూర్యగ్లోబల్, ది టీమ్ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ బీహెచ్‌పీఎస్ వీర్రాజుకి ప్రతిష్టాత్మక టైమ్స్ హెల్త్ ఎక్స్‌లెన్స్ అవార్డు-2024 అందుకున్నారు. శనివారం నాగమల్లితోట టీమ్ హాస్పిటల్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి ఐకాన్ ఇన్ క్రిటికల్ కేర్ ఇంటెన్సివ్ కేర్ సర్వీసెస్‌లో ఏపీలో ఉత్తమ వైద్య సేవలు అందించినందుకు తనకు టైమ్స్ హెల్త్ ఎక్స్‌లెన్స్ అవార్డు వచ్చిందని, శుక్రవారం హైదరాబాద్ పార్క్ హయాత్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ గవర్నర్ బిష్ణుదేవ్ నుంచి అవార్డును అందుకున్నట్టు చెప్పారు.

ఎమ్మెల్యే దాట్లకు సత్కారం

తాళ్లరేవు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత మోపూరి శ్రీనివాస్ కిరణ్ నాయకత్వంలో పలువురు టీడీపీనేతలు, కార్యకర్తలు ర్యాలీగా మురమళ్ల పార్టీకార్యాలయానికి శనివారం చేరుకున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును దుశ్శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వేగేశ్న భాస్కరరాజు, సుంకరపాలెం, ఇంజరం, ఉప్పంగల, లచ్చిపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లైబ్రేరి సైన్స్‌కు 0.5 క్రెడిట్స్‌ను కేటాయించాలి

జేఎన్టీయూకే, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వర్శిటీ కరిక్యులమ్‌లో లైబ్రేరి సైన్స్‌కు 0.5 క్రెడిట్స్‌ను కేటాయించాలని కోరుతూ గోదావరి లైబ్రేరియన్స్ సంఘ సభ్యులు శనివారం జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గోదావరి లైబ్రేరియన్స్ సంఘ కార్యదర్శి డాక్టర్ కె.సాయిబాబు మాట్లాడుతూ లైబ్రేరి సైన్స్‌కు క్రెడిట్స్ కేటాయించడం వల్ల గ్రంథాలయాల ఉనికిని గుర్తించడంతో పాటూ రీడింగ్, రీసెర్చ్, ప్రాజెక్ట్ స్కిల్స్‌ను పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. వీసీ మాట్లాడుతూ కరిక్యులమ్‌లో లైబ్రేరిసైన్స్‌కు క్రెడిట్స్‌ను పెట్టేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు. సంఘ సభ్యులు తమ్మారావు, ఆచార్యులు, రవిశంకర్ ఉన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

శంఖవరం, నవంబరు 30: (ఆంధ్రజ్యోతి) స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన సర్వసభ్యసమావేశం కోరం లేకవాయిదా పడినట్లు ఎంపీడీవో శర్మ తెలిపా రు. ఎంపీపీ పర్వత రాజబాబు అధ్యక్షతన వివిధ శాఖల పనితీరుపై నిర్వహించాల్సిన, చేయాల్సిన అభివృద్ధి పనులపై నిర్ణయం తీసుకుంటారు. అధికారులు పూర్తి స్థాయిలో హాజరైనప్పటికీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎవరూ హాజరుకాలేదు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

వన సమారాధనల సందడి


వన భోజనాల్లో పాల్గొన్న పిల్లలు,పెద్దలు

మోతుగూడెం, నవంబరు30: మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు గ్రామస్తులు కార్తీకమాసం చివరిరోజు కావడంతో వనభోజనాలు ఏర్పాటుచేశారు. ఈ వన భోజనాలు పొల్లూరు గ్రామస్తులైన ఎం.శివరామకృష్ణ వేపకాయల శ్రీను, రామచంద్రరావు, నాని కుమార్, స్వామి శర్మరమేష్ ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. వనభోజనాలతో చిన్నారుల కేరింతలతో పెద్దలు ఆటపాలతో ఈ వనభోజనాలు సందడిగా జరిగాయి.

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరు కి సమీపంలోని జీడిమామిడితోటలో అదే గ్రామానికి చెందిన కానూరి రామకృష్ణ, సత్యవతి దంపతులు కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహించి వన దేవతలకు నైవేద్యం సమర్పించారు.

అన్నదాతకు తుఫాన్ గుబులు

● తడిసి ముద్దయిన వరి పనలు


సుకుమామిడిలో తడిసి ముద్దయినవరి పనలు

మోతుగూడెం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): చింతూరు మండ లం మోతుగూడెం పరిధిలో కొత్తపల్లిపంచాయతీ సుకుమామిడి గ్రామంలో అన్నదాతకు తుఫాన్ గుబులు పెంగిల్ తుఫాన్ రైతులను భయపెడుతుంది. తీవ్ర వాయుగుండం తుఫాన్‌గా మారడంతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు కోసిన పంటను భద్రపరిచే పనిలో బిజీగా ఉన్నారు. ఇప్పటికే నాలుగు పంచాయతీలు మోతుగూడెం, కొత్తపల్లి,గూడూరు, చదలవాడ పంచాయతీలు పలుచోట్ల వరి కోతలు పూర్తయ్యాయి. తుపానుకు తడిచిపోయే అవకాశం ఉండడంతో వరి కుప్పలుపై టార్పాలిన్‌లు కప్పుతున్నారు. కొన్నిచోట్ల కోసిన వరి పనలు పొలాల్లో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాయితీపై తార్పాలిన్‌లను అందించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలి


సీఐటీయూ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తున్న సర్వశిక్ష అభియాన్ సిబ్బంది, ఉద్యోగులు

చింతూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఏవీ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం చింతూరులో సర్వ సర్వ శిక్ష అభియాన్ సిబ్బంది, ఉద్యోగుల సమావేశం సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏవీ కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చమని సమ్మె చేయడం జరిగిందన్నారు. ఆ క్రమంలో నాడు అధికారులు 16 రకాల డిమాండ్లు పరిష్కరిస్తామని మినిట్సు రూపంలో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. పలు ఒప్పందాలు అమలు కాలేదన్నారు. హామీ నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. చింతూరు డివిజను స్థాయి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం ఐటీడీఏలో కంట్రోలు రూమ్ ఏర్పాటు

● ఐటీడీఏ పీవో సింహాచలం



రంపచోడవరం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తుఫాను రీత్యా రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అన్ని మండలాల తహశీల్దార్లు, ఇతర ముఖ్యఅధికారు లతో ఆయన మాట్లాడుతూ ఆయా మండలాలలో ఉన్న వాగులను దాటకుండా తగుచర్యలు తీసుకోవాలని, ప్రజలు సురక్షితంగా తమ నివాసాల్లోనే ఉండాలని సూచించారు. తుపాను రీత్యా రెవెన్యూ, పోలీసు, ఆరోగ్య శాఖలు అప్రమత్తం గా ఉండి ప్రజల రక్షణదిశగా చర్యలు తీసుకోవా లని కోరారు. రంపచోడవరం సబ్‌కలెక్టరు కార్యాలయంలో కూడా కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కంట్రోలు రూమ్‌కు సమాచారం ఇచ్చేవారు 9441058457: 949292038నెంబర్లకు, సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08864243561 నెంబరు కు తెలియజేయాలని అన్నారు.

అన్నవరం బ్రిడ్జి నిర్మాణానికి సాయిల్‌టెస్టు


బ్రిడ్జి దగ్గర సాయిల్‌టెస్టు చేస్తున్న దృశ్యం

వీఆర్‌పురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నవరం బ్రిడ్జి నిర్మాణానికి సదరు కాంట్రాక్టర్ శనివారం సాయిల్ టెస్టు చేపట్టారు. కొన్నిరోజుల క్రితం బ్రిడ్జి నిర్మాణం కోసం, పొడవు, వెడల్పు కొలతలు తీసుకున్నారు. మండల టీడీపీ నాయకులు మాట్లాడుతూ రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీషాదేవి చొరవతో అన్నవరం బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 5 నెలల్లోనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టిందని, గత వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని ధర్నాలు, రాస్తారోకోలు చేసినా పట్టించుకోకుండా కాలయాపన చేశారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలు గు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి బొర్ర నరేష్‌కుమార్, మండల కార్యదర్శి బురక కన్నారావు, బీరక సూర్యప్రకాష్‌రావు, మాజీ మండల అధ్యక్షులు గొంది చంద్రయ్య, సవలం రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

గురమందలో లక్షపత్రి పూజ

వై.రామవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని యార్లగడ్డ సమీపంలో అటవీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా నెలకొన్న గురమంద విశ్వనాధస్వామి ఆలయంలో శనివారం కార్తీక అమావాస్య పూజలను ఘనంగా జరిపారు. తాడేపల్లిగూడెం నుంచి వచ్చిన అర్చకులు ఈశ్వరుడికి అభిషేకం, లక్షపత్రి పూజలను జరిపి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. అధికమంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

గురజాడకు నివాళి

వై.రామవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పి.యర్రగొండ గురుకుల బాలికల కళాశాలలో శనివారం గురజాడ అప్పారావు వర్ధంతిని ఘనంగా జరిపారు. ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ రచనలు భావితరాలకు స్పూర్తిదాయకమని రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మంగతాయారు కుటుంబానికి ఆర్థిక సాయం

విఆర్‌పురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) శుక్రవారంరాత్రి వడ్డిగూడెం గ్రామానికి చెందిన పొదిల మంగతాయారు అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న జమాల్‌ఖాన్ ట్రస్టు ద్వారా ఐదువేల రూపాయల సొమ్మును మృతురాలి కుటుంబానికి ట్రస్టు సభ్యుల ద్వారా శనివారం అందించారు. కార్యక్రమంలో ముత్యాల రామారావు, జలబాబు, ఎస్‌డీ సర్వరాజు, సిద్ధు, చంద్రశేఖర్, శంకర్ పాల్గొన్నారు.

పుర వీధుల్లో ఊరేగింపు

చింతూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారులు శనివారం చింతూరులో భారీ ఊరేగింపు నిర్వహించారు. లక్ష్మీగణపతి ఆలయం నుంచి మొదలైన ఊరేగింపు పురవీధుల మీదుగా సాగింది. మండల దీక్షా కాలం పూర్తైనందున ఈ ఊరేగింపు నిర్వహించినట్లు మాలధారులు తెలిపారు.


అయ్యప్ప మాలధారుల ఊరేగింపు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఫెంగల్ తుఫాన్‌తో రైతుల ఆందోళన

వర్షంలో తడుస్తున్న వరి పంట
1850 హెక్టారులకు 20 హెక్టార్లలో వరికుప్పలు వేసుకున్న రైతులు
నేలనంటిన వరి పొలాలు


తొండంగి: సీతారాంపురం వద్ద నేలకొరిగిన వరి పంట


రౌతులపూడి: గాలులకు విరిగిన పత్తి

రౌలతులపూడి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో రౌతులపూడి మండలంలోని రైతులకు తీవ్రనష్టం కలిగింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు, గాలులకు చేలు నేలవాలగా, కోసిన చేలు తడిచిపోయాయి. పత్తిచేలు పూత మీద ఉండగా గాలులకు కొమ్మలు విరిగిపోయాయి. ఇప్పటికే పేలినపత్తి తడిసిపోవడంతో రేటు తగ్గిపోతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వరి రైతులు చేతికి పంట అంది వచ్చే సమయంలో ఫెంగల్ తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయామని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 1850 హెక్టార్లలో వరిని వేయగా 102 హెక్టాల్లో కోతలు కోయగా కేవలం 20హెక్టార్లోనే వరిచేలు కుప్పలు వేసుకున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంటకు పరిహారంఇచ్చి అదుకోవాలని కోరుతున్నారు.

తుఫాన్ ప్రభావంతో వర్షం


కోటనందూరులో కోసిన వరి పంట

కోటనందూరు: ఖరీఫ్ సాగుపై వాయుగుండం ప్రభావం తీవ్రరూపం దాల్చడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా ఈ ప్రభావం మరింత తీవ్ర రూపందాల్చడంతో వరి పంట కోసిన రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. తుని సబ్ డివిజన్ పరిధిలో సుమారు 45ఏకరాల్లో వరి పంట వేశారు. ఇప్పటికే 5 శాతం కోతలు పూర్తయి వర్షంలో తడుస్తున్నాయి. మిగిలినది కోతదశలో ఉండగా ఈదురు గాలులు వేస్తే నేలకొరిగే అవకాశం ఉంది. ఇప్పటికే చాలాచోట్ల కోతకోసిన పంటను కొంత మేర కుప్పలు వేయగా, ఎక్కువమంది కోసిన పంటను అలానే వదిలేశారు. అధికారులు కూడా పంట మాసూళ్లు చేయవద్దని చెప్పడంతో శుక్రవారం నుంచి కోతలు నిలిపివేశారు.

నేలకొరిగిన వరి పంట

తొండంగి: ఫెంగల్‌తుఫాను కారణంగా కురుస్తున్న వర్షం, ఈదురుగాలుల కారణంగా పలు గ్రామాల్లో వరిపంట నేల కొరిగింది.శనివారం ఉదయం నుంచి మండలంలో తేలికపాటి వర్షం ప్రారంభమై సాయంత్రం వరకూ కొనసాగింది. దీంతోపాటు ఈదురు గాలులు వీయడంతో సీతారంపురం, కొమ్మనాపల్లి, ఏకొత్తపల్లి తదితర గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. ఇప్పటికే కొందరు రైతులు వరికోతలు పూర్తి చేయడంతో పనలపై చేను తడిసిపోయింది. మండలంలో పంపా కింద 12 వేల ఎకరాలు, పీబీసీ ఆయకట్టు కింద సుమారు ఆరువేల ఎకరాల్లో వరిపంట సాగవుతోంది. కొన్ని ప్రాంతాల్లో వరికోతలు పూర్తికాగా మరికొన్ని చోట్ల చేలు కోతలకు సిద్ధంగా ఉన్నాయి. ఫెంగల్ తుపాను ప్రభావం ఇంతటితో ఆగితే రైతులు స్వల్ప నష్టంతో బయట పడతారు. ఇదే విధమైన వాతావరణం కొనసాగితే చేతికొచ్చిన పంట నేలకొరిగి తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేలకొరిగిన పంటను కాపాడుకునే పనిలో రైతులున్నారు. తహశీల్దార్ మురార్జీ పలు గ్రామల్లో పర్యటించారు.

ప్రత్తిపాడులో చిరుజల్లులతో వర్షం

ప్రత్తిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శనివారం మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. ఈదురుగాలులు లేకపోవడంతో కోత దశలో ఉన్న వరి పంటలు నేలవారలేదు. కోత కోసిన వరి పనలు వర్షంకు తడిసి ముద్దయ్యాయి. మండలంలోని తుఫాన్ ప్రభావానికి ఇబ్బం దులు పడుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని పీసీసీ సభ్యుడుధర్నాల కోటశ్రీను మండల వ్యవసాయాధికారి గంగాధర్‌కు వినతిపత్రం అందించారు.

ఎడతెరిపిలేని వర్షం

తునిరూరల్: తుఫాన్ ఎఫెక్ట్‌తో శనివారం నుంచి ఎడతెరుపు లేకుండా కురుస్తున్న వర్షం, ఈదురుగాలలతో రైతులు అతలాకుతలం అవుతున్నారు. పంటలు చేతికి వచ్చే సమయంలో తుఫాన్ ప్రభావంతో ఈస్తున్న గాలులకు వరి పంటలు నేలకొరుగుతున్నాయి. అధికారుల అప్రమత్తతతో ఎక్కడికక్కడ రైతులు కోతలు నిలిపివేయడంతో పెద్దనష్టం తప్పింది.

పంటను ఒబ్బిడి చేసుకుంటున్న రైతాంగం

జగ్గంపేట: జగ్గంపేట మండలం కాట్రావులపల్లి, రామవరం, జగ్గంపేట గ్రామాల్లో కోసిన వరి పంటలను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. తుఫాన్ ప్రభావంతో ముసురు వాతావణంతో శనివారం ఉదయం నుంచి ఈదురుగాలులు, ఓ మోస్తరు వర్షం కురవడంతో రైతులు అప్రమత్తమయ్యారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొండబాబుకు సత్కారం

అన్నవరం/జగ్గంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొత్త కొండబాబును అన్నవరం ఆర్యవైశ్య సేవాసంఘం, వాసవీ నిత్యాన్నసత్ర సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పూర్వపు దేవస్థానం ట్రస్టీ అయిన కొండబాబు మాట్లాడుతూ నాకు అవకాశం కల్పించిన కూటమిప్రభుత్వం, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు కృతజతలు తెలిపారు. ఆర్యవైశ్యులలో పేదలకు అన్నిరకాలుగా ముందుండి ప్రభుత్వం తరుపున సహాయసహకారాలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో వాసవీ సత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీ, అన్నవరం సంఘ సభ్యులు బోనగిరి శ్రీనివాస్, ఉద్దగిరి చలమరాజు, బోలిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజులోనే 96శాతం పింఛన్ల పంపిణీ

గండేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 1వ తేదీ ఆదివారం రావడంతో ప్రభుత్వం ఒకరోజు ముందే శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించింది. ఒక్కరోజులోనే మండలంలో 96శాతం పింఛన్ల పంపిణీ అధికారులు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పూర్తి చేశారు. మండలంలో 8426 పింఛన్‌దారులు ఉండగా రూ.3కోట్ల60లక్షల41,500 పింఛన్ల సొమ్ము పంపిణీ చేయాల్సి ఉండగా 96 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో నాతి బుజ్జి తెలిపారు. పంపిణీ శనివారం ఉదయం 5గంటల నుంచే పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతంచేసి పంపిణీ చేశారు.

జగ్గంపేటలో 92శాతం

జగ్గంపేట: జగ్గంపేట మండలంలోని 16గ్రామ పంచాయతీలలో పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. సాయంత్రం 5గంటలకు 92శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో తెలిపారు. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ముందస్తుగానే శనివారం సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.

సాగు భూమికి పట్టాలివ్వాలని రైతుల వినతి

తొండంగి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా తాము సాగుచేసుకుంటున్న సాగు భూములకు రైత్వారీ పట్టాలు మంజూరు చేయాలని పి.అగ్రహారం రైతులు తహశీల్దార్ మురార్జీకి వినతి పత్రం అందించారు. శనివారం తొండంగి రెవెన్యూకార్యాలయానికి భారీగా చేరుకున్న రైతులు గ్రామంలోగల ఉత్తరాది మఠం భూములను తాము అనేక తరాలుగా సాగుచేసుకుంటున్నామని తెలిపారు. దీనికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో మఠం పేరున కాని రైతుల పేరున కాని నమోదుకాకుండా ఉండేదని ఇటీవల రెవెన్యూ రికార్డుల్లో మఠం పేరున నమోదై ఉండడాన్ని గమనించామన్నారు. రైతులకు అన్యాయం చేసే ఉద్దేశంతో ఇటువంటి ప్రయత్నం జరిగిందని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. రికార్డులు పరిశీలించి తగు చర్య తీసుకుంటామని తహశీల్దార్ వారికి తెలిపారు. కొల్లా సూరిబాబు, బెక్కం రాధాకృష్ణ, కొయ్యా శ్రీను, గోసుల సత్యన్నారాయణ, రమణ తదితరులు ఉన్నారు.

భూముల రికార్డులు తారుమారు

న్యాయం కోసం యనమల వద్దకు రైతులు

తునిరూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తొండంగి మండలంలో రాజావారి సంస్థానానికి చెందిన 410 ఎకరాల భూముల్లో పేద రైతులు ఏళ్ల తరబడి సాగులో ఉండగా గత వైసీపీ హయాంలో సంబంధిత భూముల రికార్డులు తారుమారు చేశారని తమకు న్యాయం చేయాలంటూ తొండంగి మండలం పి.అగ్రహారం గ్రామానికి చెందిన వందలాది మంది రైతులు తేటగుంటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని మాజీ మంత్రి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడికి, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్యకు వినతిపత్రం అందజేశారు. తమ ఆధీనంలో ఉన్న పంట భూములకు తమకే హక్కు కల్పించాలని మొరపెట్టుకున్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన యనమల సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని రైతులకు న్యాయంచేసే దిశగా ముందుకు వెళతామని హామీ ఇచ్చారు.

ప్రజా అవసరాలకు మై ఎమ్మెల్యే యాప్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత చేరవయ్యేందుకే మై ఎమ్మెల్యే యాప్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. అత్యాధునిక సమాచారం, సాంకేతికతను పొందుపరుస్తూ రూపొందించిన మై ఎమ్మెల్యే డిజిటల్ యాప్‌ను తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దివ్య కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు యనమల రాజేష్, ఎస్ఎల్‌రాజు, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, జక్కాన రాము నాయుడు, యాదాల రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ

ప్రత్తిపాడు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మినర్వా సంస్థలకు చెందిన జూనియర్, సీనియర్ ఇంటర్మీడియట్ ఎన్‌సీసీ విద్యార్థులు శనివారం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. డిసెంబరు1 ప్రపంచ ఎయిడ్స్ డే దినోత్సవం పురస్కరించుకుని ఎన్‌సీసీ విద్యార్థులు కలిసి స్థానిక అల్లూరి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని నినాదాలు చేశారు. మినర్వా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిబాబు, ఎన్‌సీసీ సీనియర్ విభాగం అధికారులు డి.సత్యనారాయణ, ఎన్. రవి కుమార్, లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలి

జగ్గంపేట, నవంబరు30(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల నాలుగున నిర్వహించే ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు, జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పిలుపునిచ్చారు. గోవిందపురం గ్రామంలో శనివారం జరిగిన సభలో వారు మాట్లాడారు. సూపర్ సిక్స్ మాత్రమే కాకుండా ప్రజల కోరే పీపుల్ సిక్స్‌ను సాధించాలన్నారు. తెలుగు నేల నుంచి మత రాజకీయాలను తరిమేద్దామన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య హాజరవుతారన్నారు. జక్కంపూడి రాజు, నాగులపల్లి రమణ, నాగులపల్లి అచ్చారావు పినపర్తి నాగేషు, పందిరి సూరిబాబు. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీడిపిక్కల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఏలేశ్వరం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమండ్లను పరిష్కరించాలని చిన్నింపేట జీడిపిక్కుల పరిశ్రమ లో పనిచేస్తున్న కార్మికులు శనివారం డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లగా ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను మూసేస్తే కుటుంబాలతో పస్తులు ఉండాల్సి వస్తోందని కార్మికులు వాపోయారు. యాజమాన్యం తాము కోరిన పరిహారం ఇవ్వాలని ఫ్యాక్టరీ గేటు వద్ద నిరసన తెలిపారు.

'రైతులు జాగ్రత్తలు పాటించాలి'

మోతుగూడెం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావానికి గిరిజన రైతాంగం అప్రమత్తంగా ఉండాలని వరి కోతలు వాయిదా వేయాలని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గాంధీ సూచించారు. కొత్తపల్లి, గూడూరు పంచాయతీ సచివాలయం పరిధిలో పర్యటించారు. వరి పొలాలను సందర్శించి పరిశీలించారు. మూడు రోజుల తుఫాన్ ప్రభావం ఉంటుందన్నారు. గిరిజనులకు, రైతులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.

ఆదిత్యలో నేత్ర వైద్య శిబిరం

గండేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వ ర్యంలో డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ సహకారంతో సూరంపాలెం గ్రామంలో శనివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించినట్లు యూనివర్శిటీ డిప్యూటీ ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామంలో ప్రతీఇంటికీ విద్యార్థులు వెళ్లి అవసరమైన వారిని శిబిరానికి తీసుకొచ్చి చికిత్స చేయించారు. అవసరమైన వారికి తక్కువ ధరలకు కళ్లద్దాలు ఇచ్చారు. సుమారు 70మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోసిన బాబురావు, ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, కన్వీనర్ డాక్టర్ బీహెచ్‌వి వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.రాంబాబు, ఐవీ వీరాంజనేయులు, విద్యార్థులు ఉన్నారు.

చిన్నారి వైద్యంకు రూ.10 వేల ఆర్థిక సాయం

ఎటపాక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల నిమ్ముతో బాధపడుతున్న రెండేళ్ల చిన్నారి వైద్యం కోసం ఎమ్మెల్యే శిరిషాదేవీ, ఆమె భర్త మఠం భాస్కర్ దంపతులు రూ.10 వేల ఆర్థిక సాయంను శనివారం అందజేశారు. ఎటపాక గ్రామానికి చెందిన గోడేటి రమణయ్య, సంధ్య దంపతుల రెండేళ్ల పాపకు ఊపిరితిత్తుల నిమ్ము రాగా, భద్రాచలంలో ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. చిన్నారికి నిమ్ము ఎక్కువ కావడంతో మెరుగైన వైద్యంకోసం వరంగల్‌లోని ఎంజీఎం వైద్యశాలకు తరలించాలని వైద్యులు సూచించారు. నిరుపేద కుటుంబమైన ఆ దంపతుల ఆర్థిక పరిస్థితిని స్థానిక టీడీపీ నాయకులు బాచినేని శ్రీకాంత్, పాటి సంపత్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆమె రూ.10వేల సాయంను అందించాని టీడీపీ నాయకులకు సూచించారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

చింతూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని చింతూరు ఏరియా ఆసుపత్రి వైద్యుడు ఎం.సాయికిషోర్ పేర్కొన్నారు. శినివారం చింతూరు ప్రభుత్వ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సాయికిషోర్ ఎయిడ్స్ నిర్మూలనకు అవగాహనే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. కె.రత్నమాణిక్యం, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జి. సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కార్యదర్శులకు మెమోలు జారీ

జగ్గంపేట మండలంలో 16 గ్రామ పంచాయతీలకు శనివారం ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఈ పంపిణీలో భాగంగా గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఖచ్చితంగా పాల్గొనాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ రింగ్ రోడ్ గ్రామంలోగల గుర్రపాలెం, కాండ్రేగుల గ్రామాలకు చెందిన ఎం. విజయకుమార్, వి.నూకరాజు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీలో పాల్గొనకపోవడంతో వారికి ఎంపీడీవో చంద్రశేఖర్ మెమోలు జారీ చేయడంతోపాటు ఆయన జగ్గంపేట, రాజపూడి, మల్లిశాల, కొత్తూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. 92శాతం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

'మెరుగైన సేవలు అందించాలి'


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న యనమల రామకృష్ణుడు

ఏలేశ్వరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో డాక్టర్ విజయబాబు నిర్మించిన ప్రైవేటు ఆసుపత్రి భవనాన్ని శనివారం ప్రారంభించారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, జగ్గంపేట, ప్రత్తిపాడు, రంపచోడవరం ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, మిరియాల శిరీష, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.

తుని శివాలయంలో కలెక్టర్ పూజలు

తునిరూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యంజిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్ తుని గవరపేట శివాలయంలో శివపూజలో పాల్గొన్నారు. వీరికి ఆలయ పండితులు స్వాగతం పలకగా రాష్ట్రగవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో గౌరీ సేవా సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. సూరిశెట్టి ప్రసాద్, కర్రి రమణ, కోరుబిల్లి సత్తిబాబు, పోలమరశెట్టి శివాజీ, బలరాం ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగి కామేశ్వరరావు వర్ధంతి

జగ్గంపేట, నవంబరు30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్యాలయంలో డ్రాఫ్ట్స్‌మ్యాన్‌గా ఉద్యోగం ప్రారంభించి విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై పోరాటంచేసి చివరకు ప్రాణత్యాగం చేసిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆదిభట్ల సూర్యకామేశ్వరరావు వర్ధంతిని జగ్గంపేటలోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించారు. ముందుగా ఉద్యోగులు కామేశ్వరరావు విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికిపూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్.ఎస్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జగ్గంపేట ఎలక్ట్రికల్ డీఈ వీరభద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏడీ మాలతి, ఏఈ సూర్యనారాయణ, రామకృష్ణ, ఆంజనేయులు, రాజేంద్రప్రసాద్, శివప్రసాద్, అజయ్, కడియపు వీరబ్రహ్మం, బివి రమణ పాల్గొన్నారు

'న్యాయవాదులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి'

ప్రత్తిపాడు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ కోరారు. ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వన సమారాధనలో భాగంగా ధర్మవరం అంజు ఆసుపత్రి వెనుక మామిడితోటలో న్యాయవాదులు,గుమస్తాలు కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సూర్యప్రభ, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్‌లు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆటపాటలతో ఉల్లాసంగా న్యాయవాదులు కుటుంబ సభ్యులతో గడిపారు. ఏలేశ్వరంనకు చెందిన సీనియర్ న్యాయవాది మూది నారాయణ స్వామి తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన నారాయణస్వామిని బార్ నాయకులు ఘనంగా సత్కరించారు.

కండక్టర్ రాజుకు సత్కారం

ఏలేశ్వరం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): పదవీవిరమణ చేసిన కండక్టర్ రాజు దంపతులను ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శనివారం ఆర్టీసీ గ్యారేజ్‌లో ఎంప్లాయిస్ యూనియన్ డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వి.రావు అధ్యక్షతన సుమారు 36 సంవత్సరాలుగా ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేసి పదవీవిరమణ చేస్తున్న ఎస్.వి.వి.ఎస్.ఎన్.రాజు, త్రిపుర సుందరి దంపతులకు పూలమాలలు వేసి, శాలువాకప్పి, మెమెంటోలు అందజేసి సత్కరించారు.